PRABHATA SURYA
ప్రభాత సూర్య
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 సోమవారం 7 జూలై 2025 సంపుటి: 01, సంచిక : 60
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

## సిగాచి ఇండస్ట్రీస్ పేలుడు ఘటనలో 41కి చేరిన మృతులు..

### ఇంకా దొరకని 9 మంది ఆచూకీ

సంగారెడ్డి: పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఇండస్ట్రీస్ పేలుడు ఘటనలో మరొకరు చనిపోయారు. పటాన్‌చెరు ధృవ దవాఖానలో చికిత్స పొందుతున్న జితేందర్ అనే కార్మికుడు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య 41కి చేరింది. ఈ ఘటనలో మరో తొమ్మిది మంది ఆచూకీ తెలియాల్సి ఉన్నది. పేలుడు ధాటికి కార్మికుల శరీర భాగాలు ఛిద్రమవై పరిశ్రమలోని యంత్రాలకు అతుక్కుపోయాయి. దీంతో తమవారి ఆచూకీ కోసం కార్మికుల కుటుంబ సభ్యులు సిగాచీ ఇండస్ట్రీస్ వద్ద పడిగాలు గాస్తున్నారు.

## పరిహారం దాత్రృత్వం కాదు..

# బాధ్యత

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్
- పునరావాసాన్ని ఆర్థిక లావాదేవీగా చూడొద్దు
- డిజిటల్ దుష్ప్రభావాలపై కఠిన చట్టాలు రావాలి
- 'వాయిస్ ఫర్ వాయిస్ లెస్' కార్యక్రమంలో ప్రసంగం
- కార్యక్రమంలో పాల్గొన్న ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, న్యాయమూర్తులు



సూర్య న్యూస్ హైదరాబాద్

లైంగిక బాధితులైన చిన్నారులకు అందించే పరిహారం దాతృత్వం కాదని.. అది బాధ్యతని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టం చేశారు. డిజిటలైజేషన్ దుష్ప్రభావాలను ఎదుర్కొనేందుకు బలమైన చట్టాలు రూపొందించాలన్నారు. ఆన్‌లైన్ గ్రూమింగ్, సైబర్ బెదిరింపులు, లైంగిక వేధింపులు సవాళ్లు విసురుతున్నాయని.. వాటిపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దీర్ఘకాలిక సంరక్షణ అందించే కుటుంబ, సమాజ మద్దతు వ్యవస్థలను నిర్మించాలని సూచించారు. పోలీసులు, ప్రాసిక్యూటర్లు, వైద్యులు, మనస్తత్వవేత్తలు, న్యాయాధికారులు.. సానుభూతి, సున్నితత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. బలహీనులు, అవసరమైన వారికి రక్షణగా నిలిచి.. ప్రతి చిన్నారికి జవాబుదారీగా ఉండాలని కోరారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన 'వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'అలహాబాద్ హైకోర్టులో జువెనైల్ జస్టిస్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఐదేళ్లు పనిచేసిన సమయంలో చిన్నారుల ఇబ్బందులు తెలుసుకొనే అవకాశం లభించింది. బాధిత చిన్నారులకు న్యాయం, పునరావాసం అందించాలి. పోక్సో చట్టం, పిల్లల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలి. ముందుగా సమస్య సంక్లిష్టతను గుర్తించాలి. లైంగిక వేధింపులకు గురైన బాలలు తక్షణం వారికి - మిగతా 2లో



## 'గ్లోబల్ సౌత్'కు దారుణ అన్యాయం

- ద్వంద్వ ప్రమాణాలకు బలవుతూ వస్తోంది
- బ్రిక్స్ సదస్సులో మోదీ ఆక్షేపణ
- దుమ్మా కొట్టిన జిన్‌పింగ్
- వర్చువల్‌గా హాజరైన పుతిన్



### 23.30 లక్షలు చెల్లిస్తే

## గోల్డెన్ వీసా

- భారతీయులకు యూఏఈ బంపర్ ఆఫర్
- నామినేషన్ ఆధారంగా వీసా జారీ
- ప్రాపర్టీ/వ్యాపారంలో భారీ పెట్టుబడి అక్కర్లేదిక

### తమిళ నాగరికతపై

## రాజకీయం

కీళడి నాగరికతపై ఎడతెగని వివాదం


## బెంగళూరుకు హైస్పీడ్ కారిడార్



- నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు నిర్మించే రహదారి బెంగళూరు వరకు కొనసాగింపు
- రెండు సెక్షన్లుగా రోడ్డు నిర్మాణానికి నిర్ణయం
- రెండింటి డీపీఆర్‌లకూ టెండర్లు ఖరారు
- గంటకు 120 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించేలా రోడ్డు నిర్మాణం
- తొలుత 6 లేన్లు.. భవిష్యత్తులో 8-12 లేన్లు!

## 'కన్నెపల్లి' మోటార్లు ఎందుకు ప్రారంభించరు?

- అక్కడ కనీస స్థాయి కంటే రెండున్నర మీటర్ల ఎక్కువ ఎత్తులో నీళ్లున్నాయి
- ప్రభుత్వం ఉదాసీనంగా ఉంటే.. కేసీఆర్ నాయకత్వంలో లక్షల మంది రైతులతో అక్కడికి కదులుతాం
- సర్కారుకు మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక



సూర్య న్యూస్ హైదరాబాద్

కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కనీస నీరు తీసుకునే స్థాయి(మినిమం డ్రాడౌన్ లెవెల్-ఎండీడీఎల్) కంటే రెండున్నర మీటర్ల ఎక్కువ ఎత్తులో నీళ్లున్నా మోటార్లను ఎందుకు ఆన్ చేయడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మేడిగడ్డ మరమ్మతులతో సంబంధం లేకుండా కన్నెపల్లి నుంచి నీళ్లు తీసుకోవడానికి అవకాశాలున్నాయన్నారు. ఓవైపు సాగునీటి కోసం రైతాంగం అల్లాడుతుంటే.. ప్రభుత్వం ఉదాసీనంగా ఉండటం తగదని హితవు పలికారు. రైతులను ఆదుకోవడానికి తక్షణమే పంప్‌హౌస్ - మిగతా 2లో

### నెలాఖరులోగా

# పదవుల భర్తీ



- వచ్చే నెల 30లోగా గ్రామ కమిటీల ఏర్పాటు
- ఎంపిక బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదే
- కాంగ్రెస్ నేతలకు అధిష్ఠానం దిశా నిర్దేశం

సూర్య న్యూస్ హైదరాబాద్

ఖాళీగా ఉన్న రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులు, మండల, జిల్లాస్థాయి కాంగ్రెస్ కమిటీ పదవుల భర్తీకి అర్హులైన నేతల పేర్ల జాబితాలను పీసీసీకి పంపాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులకు అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. ఈ నెలాఖరులోగా వాటిని భర్తీ చేయాలని స్పష్టం చేసింది. ఆగస్టు 30కల్లా గ్రామస్థాయి పార్టీ కమిటీల నియామకాలన్నీ పూర్తిచేయాలని పీసీసీకి గడువు పెట్టింది. పార్టీ కోసం కష్టపడేవారిని గుర్తించే బాధ్యత వారిపైనే ఉందని పార్టీ అగ్రనేతలు స్పష్టం చేశారు. "ఈ నెల 4న గాంధీభవన్‌లో పార్టీకి సంబంధించి వివిధ కమిటీల సమావేశాలకు నేను హాజరయ్యా. వాటిల్లో జరిగిన చర్చల్లో కాంగ్రెస్ సంస్థాగతంగా బలోపేతమవడమే లక్ష్యం అనేది కీలకాంశం. అట్టడుగు స్థాయిలో పార్టీని మరింత బలంగా నిర్మించాలి' - మిగతా 2లో



### మోటార్లు ఎప్పుడు

## ఆన్ చేయాలో మాకు తెలుసు

- ప్రాజెక్టు లిఫ్టులపై ఈ నెల 11న ఎన్‌సీఐడబ్ల్యూఏఎం సమావేశంలో నిర్ణయిస్తాం
- కన్నెపల్లి పంప్‌హౌస్‌పై హరీశ్‌ది ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శ

### పనే చేయకుండా..

## 12 ఏళ్లలో రూ.28 లక్షల జీతం



- మధ్యప్రదేశ్‌లో ఓ కానిస్టేబుల్ నిర్వాకం
- 12 ఏళ్ల తర్వాత వెలుగు చూసిన వైనం

# పరిహారం దాతృత్వం కాదు.. బాధ్యత



-మొదటిపేజీ తరువాయి

జరిగిన గాయం నుంచి మాత్రమే బాధపడరు. వారిని రక్షించడానికి ఉద్దేశించిన వ్యవస్థలతో తరచుగా తిరిగి గాయపడుతుంటారు. అటువంటి పిల్లలకు న్యాయం అంటే నిందితులకు శిక్ష మాత్రమే కాదు.. బాధితులకు శారీరక, మానసిక వైద్యంతోపాటు భవిష్యత్‌పై ఆశను పునరుద్ధరించాలి'అని జస్టిస్ విక్రమ్‌నాథ్ చెప్పారు.

**పోక్సో ఓ మైలురాయి..**

'లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం (పోక్సో%–%2012) తీసుకురావడం ఓ మైలురాయి. ఇది పిల్లల హక్కులను నివేదిస్తుంది. సాక్ష్యాల నమోదు, దర్యాప్తు, విచారణ కోసం బాధితులకు స్నేహపూర్వక విధానాన్ని కల్పిస్తుంది. అయితే చట్టాలు ఎంత మంచి ఉద్దేశంతో ఉన్నా వాటి అమలు తీరు కూడా పగడ్బందీగా ఉండాలి. మానసిక మద్దతు, ఉచిత న్యాయం, పునరావాసం, పునరేకీకరణకు కొత్త పథకాలు కొనసాగించాలి. తెలంగాణలో భరోసా కేంద్రాల ఏర్పాటు అభినందనీయం. పోలీసులు, వైద్య నిపుణులు, న్యాయ సాయం, మానసిక ఆరోగ్య నిపుణులను ఒకచోట అందించడంలో వాటి పాత్ర ప్రశంసనీయం. భరోసా కేంద్రంలోకి అడుగుపెట్టే బాధిత చిన్నారికి పోలీస్‌స్టేషన్‌లోకో లేక ఆస్పత్రిలోకో అడుగుపెట్టిన భావన కలగదు. భద్రత, వైద్య సాయం కోసం వచ్చామన్న ఉద్దేశంతో ఉంటారు. ఇలాంటి కేంద్రాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పోలీసులు, న్యాయాధికారులు, బాలల సంక్షేమ కమిటీలు, జువెనైల్ జస్టిస్ బోర్డులు, వైద్య సిబ్బంది, బాలల మనస్తత్వవేత్తలు, ఎన్జీవోలు అంతా కలసి పనిచేయాలి. ఈ ప్రయత్నంలో విధాన సంస్కరణలు అవసరం'అని జస్టిస్ విక్రమ్‌నాథ్ పేర్కొన్నారు.

**లోటుపాట్లను అధిగమించాలి..**

'పోక్సో కేసుల విచారణలో జాప్యం, పథకాల అమల్లో ఆలస్యం, సిబ్బంది లేమి లాంటి లోటుపాట్లను అధిగమించాలి. చైల్డ్ ఫ్రెండ్లీ కో ర్టుల ఆవశ్యకతను సుప్రీంకోర్టు పలుమార్లు నొక్కిచెప్పింది. తాజా గణాంకాలను పరిశీలిస్తే కేసుల పెండింగ్‌తోపాటు దోషుల నిర్ధారణ రేటు ఆందోళన కలిగిస్తోంది. చట్టాలు ఎన్ని ఉన్నాయనేది కాదు.. వాటిని ఎంత సమర్థంగా అమలు చేస్తున్నామనేది ముఖ్యం. కోర్టుల్లో చిన్నారులకు మౌలిక సదుపాయాలున్నాయా? న్యాయసాయానికి న్యాయవాదులు సిద్ధంగా ఉన్నారా అన్నది సమీక్షించుకోవాలి. చట్టాన్ని మించిన బాధ్యత న్యాయమూర్తులపైనా ఉంది.

ప్రతి కేసును సానుభూతితో పరిష్కరించాలి. విచారణను ఇన్ కెమెరా (ఎవరూ లేకుండా)లో నిర్వహించాలి. ప్రశ్నలను జాగ్రత్తగా అడగాలి. చిన్నారి మనల్ని విశ్వసించేలా చూడాలి. బాధిత చిన్నారుల సంరక్షణలో లీగల్ సర్వీసెస్ అథారిటీ పాత్ర కీలకం. నల్సా, రాష్ట్ర పథకాలు బాధితులకు సత్వరం అందేలా చూడాలి'అని వివరించారు. ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ శామ్‌కోషి, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, పీపీ పల్లె నాగేశ్వర్‌రావు, రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'కన్నెపల్లి' మోటార్లు ఎందుకు ప్రారంభించరు?

-మొదటిపేజీ తరువాయి

మోటార్లను ప్రభుత్వం ప్రారంభిస్తుందా, లేదంటే రైతులే ఉద్యమంగా వెళ్లి ఆన్ చేసుకోవాలా? అని నిలదీశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. కేసీఆర్ నాయకత్వంలో అన్ని జిల్లాల నుంచి లక్షల మంది రైతులతో పంప్‌హౌస్‌కి తరలివెళ్లి మోటార్లను ప్రారంభిస్తామని ఆయన హెచ్చరించారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో భారత రాష్ట్ర సమితి నేతలు వేముల ప్రశాంత్‌రెడ్డి, మధుసూదనాచారి, కల్వకుంట్ల సంజయ్, సత్యవతి రాథోడ్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, పద్మా దేవేందర్‌రెడ్డి, దేవిప్రసాద్ తదితరులతో కలిసి ఆదివారం హరీశ్‌రావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులున్నాయి. సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. విత్తనాలు వేసే, వేసినవి మొలకెత్తే పరిస్థితులు లేవు. చాలాచోట్ల ప్రాజెక్టుల కింద నారుమళ్లు పోయాలా, వద్దా? అని ఆలోచిస్తున్నారు. భూగర్భజలాలు రోజురోజుకు అడుగంటుతున్నాయి. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే.. సాగునీటికే కాదు, పలు జిల్లాల్లో తాగునీటికీ ఇబ్బందులు ఎదురవుతాయి. మహారాష్ట్ర, కర్ణాటకల్లో వర్షాలు కురవడం వల్ల కృష్ణా, గోదావరి నదుల్లో మే నెలలోనే వరదలొచ్చాయి. వరదను ఒడిసిపట్టి.. ఎక్కడికక్కడ ప్రాజెక్టుల్లో మోటార్లు ఆన్ చేసి.. రిజర్వాయర్లు, చెరువులు, చెక్‌డ్యాములు నింపుకోవాల్సిందిపోయి.. ప్రభుత్వం చోద్యం చూస్తోంది. ముఖ్యమంత్రి, మంత్రులు భారత రాష్ట్ర సమితిపై బురద చల్లడంలో పోటీపడుతున్నారు. కరవును పారదోలే కాళేశ్వరం ప్రాజెక్టును.. కేసీఆర్‌పై కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనబెడుతోంది. భారత రాష్ట్ర సమితిపై కోపముంటే.. మాపై కక్ష సాధించండి. రైతులకు ఎందుకు శిక్ష వేస్తున్నారు?

**నీళ్ల విలువ తెలియని నాయకుడు రేవంత్**

నీళ్ల విలువ తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రిగా ఉంటే.. వాటిని మళ్లించుకునే ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటారు. కానీ, రేవంత్‌రెడ్డి నీళ్ల విలువ తెలియని నాయకుడు. వరద వచ్చి నెల రోజులు దాటినా మోటార్లను ప్రారంభించలేదు. కళ్ల ముందు నుంచి నీళ్లు పోతోంటే పట్టించుకోని ప్రభుత్వం తీరు.. నేరపూరిత నిర్లక్ష్యం కిందికే వస్తుంది. మేడిగడ్డలో రెండు పియర్స్ కుంగాయనే సాకుతో ప్రభుత్వం దాన్ని పక్కనబెట్టింది. అయితే మేడిగడ్డతో సంబంధం లేకుండా కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీళ్లు తీసుకునే అవకాశముంది. మేడిగడ్డ దగ్గర ప్రస్తుతం 73,600 క్యూసెక్కుల నీళ్లు ప్రవహిస్తున్నాయి. కన్నెపల్లి పంప్‌హౌస్ మినిమం డ్రాడౌన్ లెవెల్(ఎండీడీఎల్) 93.5 మీటర్లు. ఇప్పుడు నదీ ప్రవాహస్థాయి 96 మీటర్ల ఎత్తులో ఉంది. అంటే ఎండీడీఎల్ కంటే రెండున్నర మీటర్ల ఎక్కువ ఎత్తులో నీళ్లు పోతున్నాయి. రోజుకు రెండు టీఎంసీలు తీసుకునే అవకాశముంది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై శాసనమండలిలో ఎమ్మెల్సీ కోదండరాం అడిగిన ప్రశ్నకు ఆ రెండు బ్యారేజీలూ బాగున్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానమిచ్చారు. అన్నారం, సుందిళ్ల, కన్నెపల్లి పంప్‌హౌస్ లక్షణంగా పనిచేస్తున్నప్పుడు.. బటన్ నొక్కి నీళ్లు తీసుకోవడంలో నిర్లక్ష్యమెందుకు? ఈరోజు కాళేశ్వరం మోటార్లు ప్రారంభిస్తే.. 15 జిల్లాలకు నీళ్లొచ్చే అవకాశముంది. వెంటనే మోటార్లు ప్రారంభించి.. రిజర్వాయర్లు నింపి.. పంటకు నీళ్లివ్వాలని డిమాండ్ చేస్తున్నాం. లేకపోతే ప్రభుత్వాన్ని విడిచిపెట్టం. ప్రజా బలమేంటో చూపిస్తాం.

**పాలమూరు రైతుల కడుపు కొడుతున్నారు**

కృష్ణా నదిలోనూ ఇదే పరిస్థితి. తాను పాలమూరు బిడ్డనని ముఖ్యమంత్రి పదేపదే చెబుతుంటారు. కానీ, పాలమూరు రైతుల కడుపు కొడుతున్నారు. శ్రీశైలంలో మే 30న వరద వచ్చింది. ఇప్పటివరకు కల్వకుర్తి మోటార్లు ఆన్ చేయలేదు. నాటి తెదేపా, కాంగ్రెస్ ప్రభుత్వాలు కల్వకుర్తి ప్రాజెక్టును పట్టించుకోకపోతే.. కేసీఆర్ వచ్చిన వెంటనే పనులు పూర్తి చేసి.. మూడు లక్షల ఎకరాలకు నీళ్లిచ్చారు. గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. చంద్రబాబు కోసం 65 టీఎంసీలను రేవంత్‌రెడ్డి ధారాదత్తం చేశారు. ఈ ఏడాది కూడా వరద నీరు ముందే వచ్చినా.. మోటార్లు ఆన్ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోంది. వెంటనే కల్వకుర్తి మోటార్లు ఆన్ చేయకపోతే.. మహబూబ్‌నగర్ భారత రాష్ట్ర సమితి నాయకులు వేల మంది రైతులతో కలసి ప్రాజెక్టు వద్దకెళ్లి.. మోటార్లు ప్రారంభించే పరిస్థితి వస్తుంది" అని హరీశ్‌రావు హెచ్చరించారు.

# మోటార్లు ఎప్పుడు ఆన్ చేయాలో మాకు తెలుసు

హైదరాబాద్

ప్రతి ఏటా జులై నెల చివర్లో లేదా ఆగస్టు 1న కల్వకుర్తి మోటార్లకు స్విచ్ ఆన్ చేసి వానాకాలం పంటలకు నీరందిస్తారని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈసారి కూడా ఇదే విధానం అమలవుతుందని, రైతులు సందేహించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు పదేపదే మాట్లాడటం వెనుక ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర ఉందని ఆక్షేపించారు. గోబెల్స్‌కు మించి అబద్ధాలను ప్రచారం చేయడం హరీశ్‌రావుకు అలవాటుగా మారిందన్నారు. కల్వకుర్తి లిఫ్టు ఎప్పుడు ఆన్ చేయాలో తమకు తెలుసని పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.

"2019లో ఆగస్టు 11న, 2020లో ఆగస్టు 31న, 2021లో ఆగస్టు 15న, 2022లో జులై 13న, 2023లో ఆగస్టు 6న కల్వకుర్తి పంపులను ఆన్ చేశారు. గతేడాది జులై 27న స్విచ్ ఆన్ చేశారు. ఈనెల 11న జరిగే స్టేట్ లెవల్ కమిటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ వాటర్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్(ఎస్‌సీఐడబ్ల్యూఏఎం) సమావేశంలో తీసుకునే నిర్ణయాల ఆధారంగా అన్ని సాగునీటి ప్రాజెక్టులు, ఆయకట్టుకు ప్రణాళిక సిద్ధమవుతుంది. రైతుల అవసరాలు, నీటి నిల్వల ఆధారంగా సాగునీటి ప్రాజెక్టుల్లో నీటిని ఎప్పుడు విడుదల చేయాలి. ఎంత ఆయకట్టుకు సాగునీరు అందించాలి.. ఎంత సమర్థంగా నీటిని వాడుకోవాలి అన్న అంశాలపై ప్రభుత్వం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుంది.



**కల్లబొల్లి మాటలు నమ్మాల్సిన అవసరంలేదు**

కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటి విడుదలపై హరీశ్‌రావు కల్లబొల్లి మాటలు నమ్మాల్సిన అవసరం మాకు లేదు. గతంలో మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లికి లిఫ్ట్ చేసిన 160 టీఎంసీలలో దాదాపు 57 టీఎంసీల నీళ్లు మళ్లీ గేట్లు ఎత్తి సముద్రంలోకి వదిలి ప్రజాధనాన్ని వృథా చేసిన విషయం మరిచిపోయారా? కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ చేసిన ప్రకారం మేడిగడ్డ దగ్గర కన్నెపల్లి పంపు హౌస్ నుంచి నీటిని లిఫ్ట్ చేసి అన్నారం.., అక్కడి నుంచి సుందిళ్లకు నీటిని ఎత్తిపోయాలి. ఆ మూడు బ్యారేజీలు తప్పుడు సాంకేతిక పరిజ్ఞానం, ఆకృతితో గత ప్రభుత్వం నిర్మించింది. ఈ బ్యారేజీలు ప్రమాదకరంగా ఉన్నాయని ఎన్‌డీఎస్ఏ హెచ్చరించింది. భారత రాష్ట్ర సమితి అసమర్థత, నిర్లక్ష్యంతో మేడిగడ్డ కుంగిపోయింది. అన్నారం, సుందిళ్ల ప్రమాదకరంగా మారాయి. ఎన్‌డీఎస్ఏ సలహాలు, సూచనల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులపై తగిన నిర్ణయం తీసుకుంటుంది. కృష్ణా జలాలను ఏపీ అక్రమంగా తరలించడం వెనక నాటి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ కుట్ర బయటపడింది. పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచడం, రాయలసీమ ఎత్తిపోతల ద్వారా నీటిని ఏపీ మళ్లించుకునే కుట్రలకు భారత రాష్ట్ర సమితి చాటుగా సహకరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతి. దేశ చరిత్రలో ఒకే ఏడాది 283 లక్షల టన్నుల ధాన్యం సాధించిన రికార్డు మా సర్కారుది. ఇప్పటికైనా హరీశ్‌రావు అబద్ధాలు మాట్లాడటం మానుకోవాలి" అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## నెలాఖరులోగా పదవుల భర్తీ

-మొదటిపేజీ తరువాయి

అని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టులో వివరించారు. రాష్ట్రంలో బ్లాక్, మండల, డివిజన్ స్థాయి పార్టీ కమిటీల నియామకాలలో ఎక్కువ భాగం ఇప్పటికే పూర్తయినట్లు ఆయన తెలిపారు. కులగణనతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కీలక సంక్షేమ పథకాలపైనా ఈ సమావేశాల్లో సమీక్షించినట్లు వివరించారు.

**ఎన్నికల్లో గెలిచి తీరాలి....**

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘనమైన విజయం సాధించేందుకు నేతలంతా ఐక్యంగా కృషి చేయాలని పార్టీ అధిష్ఠానం రాష్ట్ర నేతలకు సూచించింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ నెగ్గింది. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సైతం గెలిచి తీరాలని అగ్రనేతలు రాష్ట్ర ముఖ్యనేతలకు సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో ఓడిపోయిన అజారుద్దీన్ తాను అప్పుడు ఎంతో కష్టపడ్డానని, ఉప ఎన్నికలోనూ తనకే టికెట్ ఇవ్వాలని జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు విన్నవించారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ కూడా ఈ టికెట్ ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఖర్గే.. పీసీసీ సమావేశాలలో పాల్గొని క్రమశిక్షణ లేనివారిని ఉపేక్షించవద్దని హెచ్చరించడంతో పార్టీ నేతలు అప్రమత్తమయ్యారు. ఒకే తాటిపైకి తెచ్చే బాధ్యతలను ఇన్‌ఛార్జి మంత్రులకు అప్పగించినందున వారు దృష్టి సారించినట్లు పీసీసీ వర్గాలు తెలిపాయి. చెప్పినా వివాదాల్లో ఉంటున్న నేతలు వినకపోతే పార్టీ క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ చర్యలు తీసుకుంటుందని సీనియర్ నేతలు వివరించారు. ఒకరిద్దరు నేతలు వ్యక్తిగత విభేదాలతో చేస్తున్న విమర్శల వల్ల రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు మంచిపేరు రావడం లేదని పార్టీ వర్గాలు అధిష్ఠానానికి చెప్పినట్లు తెలుస్తోంది. గ్యారంటీ హామీల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తున్నా ప్రజలకు సమాచారం చేరవేయడంలో వెనుకబడుతున్నట్లు నేతలు తెలిపారు. ప్రధానంగా క్షేత్రస్థాయిలో పలువురు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు, ఇతర నేతలు ప్రభుత్వ కార్యక్రమాలపై సరైన ప్రచారం చేయడం లేదనే ఆరోపణలున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో కొత్తగా కాంగ్రెస్‌లో చేరినవారికి, పాత నేతలకు మధ్య విభేదాలు పెరిగి రచ్చకెక్కుతున్నందున వారిని ఉపేక్షించవద్దని కేసీ వేణుగోపాల్ హెచ్చరించినట్లు సమాచారం. పార్టీ గీతను దాటి రచ్చకెక్కే నేతలపై గట్టి చర్యలు తీసుకునే బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డిపైనే ఉందని అధిష్ఠానం స్పష్టం చేసినట్లు నేతలు వివరించారు.

## తమిళ నాగరికతపై రాజకీయం

చెన్నై

పురాతన నాగరికత ఆనవాళ్లు, చరిత్ర ఏ సంస్కృతికైనా గర్వకారణమే. అందులోనూ తమ భాషను, సంస్కృతిని విపరీతంగా ప్రేమించే తమిళుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అలా వారు వెలుగులోకి తెచ్చిన కీళడి నాగరికత, అది కొనసాగిన కాలం విషయంలో ఆ రాష్ట్రానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య ఎడతెగని వివాదం నెలకొంది. కీళడి తవ్వకాలలో లభించిన ప్రాచీన వస్తువులు, నగర శిథిలాలను బట్టి అక్కడి తమిళుల నాగరికత కాలం 2,800 సంవత్సరాలకు మునుపటిదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా.. అది 2,300 ఏళ్ల మునుపటిదేనని కేంద్రం అంటోంది. అంతేకాదు కీళడి నాగరికతకు సంబంధించి భారత పురాతత్వ శాఖ (ఏఎస్ఐ) రూపొందించిన నివేదికను పక్కన పెట్టింది. దీనిపై తమిళ రాజకీయపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఆర్ఎస్ఎస్, బీజేపీ భావజాలానికి, వారు చెప్పే సిద్ధాంతాలను తోసిరాజనేలా కీళడి నాగరికత ఉండటంతోనే వివక్షాపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నాయి. ఇప్పుడీ అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

మిళనాడులోని మదురై ప్రాచీన నగరం. తమిళ సాహిత్యానికి, సంస్కృతికి పుట్టినిల్లు. ఆ నగరం చుట్టూ తమిళ శిలా శాసనాలు, కుడ్య శాసనాలు, తిరుప్పరంకుండ్రం, అళగన్‌కుళం శాసనాలు వంటివెన్నో లభించాయి. ఈ క్రమంలో మదురై చేరువగా తమిళ ప్రాచీన నాగరికత ఆనవాళ్లు ఉండవచ్చన్న ఆలోచనతో ఆ రాష్ట్ర పురావస్తు శాఖ 2014లో తవ్వకాలు చేపట్టింది. అక్కడి వైగై నది తీరాన ప్రాచీన కట్టడాలు, నీటి కాలువలు, చేనేత పరిశ్రమకు సంబంధించిన ఆనవాళ్లు, కుండలు, పెంకులు, ఆభరణాలు వంటివెన్నో బయటపడ్డాయి. దీనిపై తమిళనాడు ప్రభుత్వం కేంద్రానికి నివేదిక పంపింది. కీళడిలో నగర నాగరికత 2,800 సంవత్సరాలకు పూర్వమే ఆవిర్భవించిందని పేర్కొంది. మరోవైపు కీళడిలో భారత పురావస్తుశాఖ (ఏఎస్ఐ)కి చెందిన అమర్‌నాథ్ రామకృష్ణన్ నేతృత్వంలోని పరిశోధకుల బృందం కూడా తవ్వకాలు జరిపి 2,800 సంవత్సరాలకు పూర్వం ఈ నాగరికత ఆవిర్భవించిందని, క్రీస్తుపూర్వం ఆరో శతాబ్దంలో అంటే 2,500 సంవత్సరాలకు ముందు విస్తరించిందని పేర్కొంది. రామకృష్ణన్ బృందం 2,800 సంవత్సరాలకు పూర్వమే ఈ నాగరికత ఆవిర్భవించిందని పేర్కొన్నా.. అది విస్తరించిన కాలాన్ని కేంద్రం పరిగణనలోకి తీసుకోవడం వివాదానికి దారితీసింది.

**500 సంవత్సరాలకు కోత పెట్టి!**

అమర్‌నాథ్ రామకృష్ణన్ నివేదిక, కీళడిలో లభ్యమైన వస్తువులను బట్టి చూస్తే తమిళుల నాగరికత కాలం 2,300 సంవత్సరాల క్రితం నాటిది మాత్రమేనని అవగతమవుతోందని కేంద్రం పేర్కొంది. ఈ నాగరికత కాలాన్ని 500 సంవత్సరాలు తగ్గించాలని సూచించింది. అయితే కీళడి వద్ద తవ్వకాలు, పురాతన ఆధారాల గుర్తింపు అంతా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో చేపట్టామని, ఆ వస్తువులన్నీ ఏ కాలానికి చెందినవో పరిశోధకులు నిర్ధారించారని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి స్పష్టం చేసింది. కీళడి పురావస్తు పరిశోధనలపై ఏఎస్ఐ, రాష్ట్ర పురావస్తు శాఖ సమర్పించిన నివేదికలను అధికారికంగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేసింది. "పురావస్తు తవ్వకాల్లో లభించే పెంకులు, బంగారం, వెండి, ఇనుము వంటి వస్తువులు ఎన్నేళ్ల క్రితం నాటివో క్షణాల్లో తేల్చి చెప్పగల స్కానింగ్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి ఈ వస్తువుల కాలాన్ని తమిళనాడులోనే కాదు, ఇతర రాష్ట్రాల్లో కూడా స్కానింగ్ చేసి నిర్ధారించాం. అశోక చక్రవర్తి గురించి పుస్తకాల్లో చదువుకుంటున్నాం. చెట్లు నాటారని, ధర్మసత్రాలు కట్టారని చదువుతున్నాం. అసలు అశోకుడి పేరుతో ఓ రాజు ఉండేవాడని లోకానికి తొలుత తెలియజేసింది జేమ్స్ ప్రిట్సప్ అనే చరిత్రకారుడే. ఆ చరిత్రకారుడు కనుగొని చెప్పినదే తమిళ బ్రాహ్మి లిపి. అన్ని నాగరికతల కంటే తమిళుల నాగరికత అత్యంత ప్రాచీనమైనదని లోకానికి ఎలుగెత్తి చాటేందుకు సిద్ధమవుతున్నాం" అని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, చారిత్రక పరిశోధకుడు బాలకృష్ణన్ చెప్పారు.

**కీళడి నివేదికను ఆమోదించాల్సిందే: స్టాలిన్**

సంగ సాహిత్యంలో వివరించిన జీవన విధానం కీళడి ఆవిష్కరణలతో శాస్త్రీయంగా నిర్ధారణ అయిందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. కీళడి పురావస్తు తవ్వకాలపై బ్రిటన్‌లోని లివర్‌పూల్ జాన్ మూర్స్ విశ్వవిద్యాలయం తాజాగా నిర్వహించిన పరిశోధనలు కూడా తమిళుల సంస్కృతి ప్రాచీనతను గుర్తించాయని తెలిపారు. కేంద్రం ఏ మాత్రం జాప్యం చేయకుండా కీళడి తవ్వకాల నివేదికను ఆమోదించాలని డిమాండ్ చేశారు. కీళడిలో లభించిన పుర్రెలను పరిశీలించిన జాన్‌మూర్స్ విశ్వవిద్యాలయం.. త్రీడీ సాంకేతిక పరిజ్ఞానంతో 2,500 ఏళ్లకు పూర్వంనాటి ప్రజల ముఖకవళికలను పునర్నిర్మించటం పట్ల తాము గర్వపడుతున్నామని చెప్పారు. 5,300 ఏళ్లకు ముందే తమిళనాట ఇనుప, ఇతర లోహపు వస్తువులను ఉపయోగించేవారని పురావస్తు తవ్వకాల్లో వెల్లడైందని, దక్షిణ భారతం అప్పట్లోనే ఇనుప లోహాన్ని వాడేవారని నిర్ధారణ అయిందని స్పష్టం చేస్తున్నారు. కీళడి నాగరికత కాలాన్ని 500 సంవత్సరాలు తగ్గించాలన్న కేంద్రం సూచనపై తమిళనాడులోని రాజకీయ పార్టీలన్నీ మండిపడుతున్నాయి. డీఎంకే, అన్నాడీఎంకే, టీవీకే సహా ప్రధాన పార్టీల నేతలంతా కేంద్రం తీరును తప్పుపడుతున్నారు. కీళడి నగర నాగరికతను సింధు నాగరికతతో పోల్చటాన్ని కేంద్రంలోని పాలకులు ఏ మాత్రం సహించలేకపోతున్నారని ఆరోపిస్తున్నారు.

# ‘గ్లోబల్ సౌత్’కు దారుణ అన్యాయం

రియో డీ జనీరో




ప్రపంచ ఆర్థికవ్యవస్థ పురోగతికి ఎంతగానో తోడ్పాటు అందిస్తున్న దక్షిణార్ధ గోళ దేశాలు (గ్లోబల్ సౌత్) కీలక నిర్ణయాలు, ప్రయోజనాల విషయంలో బాధిత దేశాలుగా మిగిలిపోతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆవేదన వ్యక్తంచేశారు. ఇందుకు బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు వేదికైంది. సదస్సుకు అధ్యక్ష, ఆతిథ్య దేశంగా వ్యవహరిస్తున్న బ్రెజిల్‌లోని రియో డీ జనీరో నగరంలో ఆదివారం బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ఆరంభమైంది. సదస్సులో భాగంగా ప్లీనరీ సెషన్‌లో తొలుత బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డసిల్వా మాట్లాడాక మోదీ మాట్లాడారు.

**అవన్నీ నెట్‌వర్క్‌లేని ఫోన్లే**

“ప్రపంచ ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదపడే గ్లోబల్ సౌత్ దేశాలు చివరకు ద్వంద్వ ప్రమాణాల కారణంగా బాధితదేశాలుగా మిగిలిపోతున్నాయి. అభివృద్ధి, వనరుల పంపిణీ, భద్రత వంటి ఏ రంగంలో చూసినా గ్లోబల్ సౌత్ దేశాలకు దక్కేది శూన్యం. వాతావరణ మార్పుల కట్టడికి ఆర్థిక సాయం, సుస్థిరాభివృద్ధి, అధునాతన సాంకేతికత బదిలీ వంటి అంశాల్లో గ్లోబల్‌సౌత్ దేశాలు తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్నాయి. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వంటి అంతర్జాతీయ వ్యవస్థలు, సంస్థలను తక్షణం సంస్కరణల బాట పట్టించి దక్షిణార్ధ గోళ దేశాలకు న్యాయం జరిగేలా చూడాలి. విశ్వ ఆర్థికానికి కీలక భాగస్వామిగా ఉండి కూడా ప్రధాన నిర్ణయాత్మక వేదికలపై గ్లోబల్‌సౌత్‌కు స్థానం దక్కడం లేదు. వాటి వాణి వినపడటం లేదు. ఇది ప్రాతినిధ్యం దక్కట్లేదనే మాట కంటే విశ్వసనీయంగా, ప్రభావవంతంగా పనిచేసి కూడా ఎలాంటి ప్రయోజనం, లబ్ధి పొందలేపోవడమే గ్లోబల్ సౌత్ దేశాలకు అశనిపాతమవుతోంది. 20వ శతాబ్దంలో ఆవిర్భవించిన ఎన్నో కీలక అంతర్జాతీయ వ్యవస్థల్లో మూడింట రెండొంతుల జనాభాకు అసలు ప్రాతినిధ్యమే దక్కడం లేదు. గ్లోబల్‌సౌత్ దేశాలు లేకుండా ఇలాంటి వ్యవస్థలన్నీ సిమ్‌కార్డు ఉన్నా నెట్‌వర్క్‌లేని మొబైల్ ఫోన్ లాంటివే” అని మోదీ వ్యాఖ్యానించారు.

**ఉగ్రవాదంపై సమిష్టి పోరు**

ఉగ్రవాదంపై ప్రపంచ దేశాలన్నీ సమిష్టిగా పోరాడాల్సిన అవసరం చాలా ఉందని మోదీ పిలుపునిచ్చారు. పహల్గాంలో అమాయక పర్యాటకులపై పాక్ ప్రేరేపిత జైషే ముష్కర మతా జరిపిన పాశవిక దాడిని ఈ సందర్భంగా బ్రిక్స్ దేశాధినేతలకు ఆయన గుర్తు చేశారు. బ్రిక్స్ వేదికగా ఆ దాడిని మరోసారి ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ విషయంలో ప్రపంచ దేశాలన్నీ భారత్‌కు అండగా నిలిచాయని గుర్తు చేసుకున్నారు. మరోసారి అలాంటి దుస్సాహసానికి పాల్పడకుండా పాక్‌కు మర్చిపోలేని రీతిలో సైనికంగా గుణపాఠం చెప్పామన్నారు. ఉగ్ర మూలాలను పెకిలించివేయనిదే ప్రపంచ శాంతి అసాధ్యమన్నారు.

**టైప్‌రైటర్లతో నేటి సాఫ్ట్‌వేర్ నడవదు**

“సమకాలీన ప్రపంచం, కాలానికి తగ్గట్లుగా మేం మారతాం అని ప్రస్ఫుటంగా తెలియజెప్పేందుకే బ్రిక్స్ కూటమిలోకి కొత్త దేశాలను ఆహ్వానిస్తున్నాం. మా బాటలోనే ఐరాస భద్రతా మండలి, ప్రపంచ వాణిజ్య సంస్థ, బహుళజాతి అభివృద్ధి బ్యాంక్‌లు సంస్కరణలను తీసుకొచ్చి తమ చిత్తశుద్ధిని చాటాలి” అని మోదీ హితవు పలికారు. కృత్రిమమేధ యుగంలో సాంకేతికత వారం వారం అప్‌డేట్ అవుతోంది. అలాంటప్పుడు 80 ఏళ్ల క్రితం ఏర్పడిన ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థల్లో ఎప్పటికప్పుడు సంస్కరణల అప్‌డేట్లు జరగాల్సిందే. 20వ శతాబ్దినాటి టైప్‌రైటర్లతో 21వ శతాబ్దంలోని అధునాతన సాఫ్ట్‌వేర్ నడవదు. స్వీయ ప్రయోజనాలకంటే కూడా భారత్ మానవాళి ప్రయోజనాలకే పట్టకడుతుంది. బ్రిక్స్‌దేశాలతో కలిసి సమష్టిగా అన్ని రంగాల్లో నిర్మాణాత్మకమైన ప్రాతినిధ్యం వహించేందుకు మేం సదా సిద్ధంగా ఉన్నాం” అని మోదీ అన్నారు.

# బెంగళూరుకు హైస్పీడ్ కారిడార్

హైదరాబాద్



హైదరాబాద్– బెంగుళూరు హైవేకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ రహదారి విస్తరణ సమస్యకు కేంద్రం ఎట్టకేలకు తెరదించింది. హైదరాబాద్–బెంగుళూరు మార్గంలో హైస్పీడ్ కారిడార్‌ను నిర్మించాలని నిర్ణయించింది. దీని నిర్మాణానికి అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) రూపకల్పన బాధ్యతలను టెండర్ ద్వారా ఓ సంస్థకు అప్పగించింది. కాగా, డీపీఆర్ కోసం రూ.12.63 కోట్లు వెచ్చించనున్నట్టు ఎన్‌హెచ్ఏఐ పేర్కొంది. మరోవైపు నాగపూర్–హైదరాబాద్ వరకు కూడా మరో హైస్పీడ్ కారిడార్‌ను నిర్మించాలని కేంద్రం ఇదివరకే నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనికి అవసరమయ్యే డీపీఆర్ రూపకల్పన బాధ్యతను కూడా ఓ సంస్థకు కట్టబెట్టింది. తాజాగా డీపీఆర్ రూపకల్పనకు అవసరమైన ‘లెటర్ ఆఫ్ అగ్రిమెంట్’ కూడా చేసుకున్నారు. ఈ డీపీఆర్ కోసం రూ.14.99కోట్లు వెచ్చించనున్నారు. ఈ రెండు మార్గాలను ‘విజన్–2047’ జాతీయ రహదారుల మాస్టర్ ప్లాన్‌లో కూడా చేర్చినట్టు ఎన్‌హెచ్ఏఐ తెలిపింది. త్వరలోనే ఈ మార్గాలకు సంబంధించిన సర్వే పనులు మొదలు కానున్నాయి. జాతీయ రహదారుల విభాగంలో ఉన్న నార్త్‌సౌత్ కారిడార్ (ఎన్‌హెచ్–44)లో భాగంగా నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వరకు నిర్మించబోయే జాతీయ రహదారినే బెంగళూరు వరకు కొనసాగించాలని నిర్ణయించింది. అందుకోసం ఈ రహదారిని రెండు సెక్షన్లుగా విభజించింది. నాగ్‌పూర్–హైదరాబాద్ వరకు ఒకటి, హైదరాబాద్ నుంచి బెంగళూరు వరకు మరో సెక్షన్‌గా చేపట్టనుంది. ఈ హైస్పీడ్ కారిడార్‌ను 6 లేన్లుగా నిర్మించనుండగా, భవిష్యత్తులో 8లేన్లు, ట్రాఫిక్ రద్దీని బట్టి 12 లేన్లుగా విస్తరించే అవకాశం ఉంది. ఈ క్రమంలో 12 లేన్ల విస్తరణకు అవసరమైన స్థాయిలోనే భూసేకరణ చేయనున్నట్టు అధికార వర్గాలు అంటున్నాయి. ఈ రోడ్డు తెలంగాణలో 195 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 260 కి.మీ, కర్ణాటకలో 106 కి.మీ మేర నిర్మాణం కానుంది. మొత్తం 1,150 కిలోమీటర్ల మేర నిర్మితమయ్యే ఈ రహదారికి రూ.35వేల కోట్లకు పైగా అవసరమవుతాయని అంచనా. నాగపూర్–హైదరాబాద్– బెంగుళూరు వరకు ప్రతిపాదించిన హైస్పీడ్ కారిడార్‌పై గంటకు 120 కి.మీ కన్నా ఎక్కువ వేగంతో వాహనాలు ప్రయాణించేలా రోడ్డును నిర్మించనున్నట్టు తెలిసింది. ఆ మేరకే సర్వే నిర్వహించనున్నట్టు సమాచారం.

# రాజకీయ రంగంలోకి ఎలాన్ మస్క్

**వాషింగ్టన్:** అమెరికా రాజకీయాల్లో కీలక మలుపు అంటూ,. ప్రపంచ కుబేరుడు, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ రాజకీయ రంగంలోకి వస్తున్నానంటూ ఆయన స్వయంగా షేర్ చేసిన కొత్త పార్టీ ప్రకటన.. తాజాగా పెద్ద చర్చకు దారి తీసింది. ది అమెరికా పార్టీ’ అనే పేరుతో మూడో రాజకీయ శక్తిని ప్రకటించిన మస్క్, ఆ పార్టీకి రెండు తలల పాము మీమ్‌ను షేర్ చేశారు. కానీ మస్క్ నిజంగానే కొత్త పార్టీని పెట్టారా.. ?లేక జనాల్ని వెర్రివాళ్లను చేయడానికే ఇలా చేశారా అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎందుకంటే.. అమెరికన్ చట్టాల ప్రకారం..ఆయన అధ్యక్షుడిగా ఎన్నికల బరిలోకి దిగేందుకు అనర్హులు. దీంతో మస్క్ కొత్త పార్టీపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. మస్క్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికల్లో పోటీ చేస్తారా? లేదంటే.. కొత్త పార్టీ లేదు. ఏమీ లేదు. తూచ్ అని పక్కకు తప్పుకుంటారా? అని చూడాల్సి ఉండగా.. మస్క్ 2028లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నా, అమెరికన్ రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆయన అనర్హులు. ప్రస్తుత అమెరికా రాజ్యాంగాల ప్రకారం.. ఆర్టికల్ 2, సెక్షన్ 1 ప్రకారం.. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు సదరు అభ్యర్థి అమెరికా పౌరుడై ఉండాలి. తద్వారా మస్క్‌కు అర్హత లేదు. కారణం ఆయన జన్మస్థలం దక్షిణాఫ్రికా కావడం.

**మస్క్ పార్టీపై సవాలక్ష ప్రశ్నలు**

ఈ నేపథ్యంలో, మస్క్ పార్టీ విస్తరణకు ముందు వ్యతిరేక వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ఆయన మాత్రం అధ్యక్ష పదవిపై నిర్ణయం వచ్చే ఏడాది చెబుతానంటూ ట్వీట్ చేశారు. ఇంతకీ.. మస్క్ టార్గెట్ ఏంటి? అమెరికాను పాలించాలని చూస్తున్నారా? పార్టీగా ప్రభావం చూపాలని అనుకుంటున్నారా? అనేది సదరు అమెరికన్ పౌరుల్లో పుట్టుకొస్తున్న సవాలక్ష ప్రశ్నలు.. ఈ ప్రశ్నలన్నింటికి కాలమే సమాధానం చెప్పాల్సి ఉంది. ఈ క్రమంలో మస్క్ కొత్త పార్టీ ఏర్పాటు? అందుకు గల కారణాలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. అమెరికాలో ప్రస్తుతం అధికార, ప్రతిపక్ష రిపబ్లికన్, డెమోక్రాట్ పార్టీలు ప్రజల స్వేచ్ఛను హరించుతున్నాయని మస్క్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ ప్రతిపాదించిన కీలక ‘బిగ్ బ్యూటిఫుల్ బిల్’ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ బిల్లు ఆమోదం పొందిన వెంటనే, మస్క్ అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం జులై 4న తన కొత్త పార్టీని ప్రకటించారు. ముందుగా కొత్త పార్టీ స్థాపన విషయంలో నెటిజన్ల అభిప్రాయాల్ని సేకరించారు. కొత్త పార్టీకి మద్దతుగా 1.2మిలియన్ల మంది నెటిజన్లు స్పందించారు. దాదాపు 80 శాతం మంది మస్క్‌కు మద్దతు తెలిపారు. ఈ ఫలితాల ఆధారంగా, ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తూ ఆయన కొత్త పార్టీని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.

**త్వరలోనే పార్టీ లోగో ప్రకటన**

పార్టీ పేరు ది అమెరికా పార్టీగా నామకరణం చేసినా.. పార్టీ గుర్తును రెండు తలల పాము మీమ్‌ను షేర్ చేస్తూ తన పార్టీ ప్రస్తుత రాజకీయ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా నిలబడుతుందనే సంకేతాలిచ్చారు. ఇది అధికారిక పార్టీ లోగోగా ప్రకటించలేదు కానీ.. ప్రారంభ దశలో పార్టీ భావజాలానికి ప్రతీకగా ఈ చిహ్నాన్ని ఉపయోగిస్తున్నారు. భవిష్యత్తులో పార్టీకి ప్రత్యేక లోగో, జెండా, రంగులు ప్రకటించే అవకాశం ఉంది.

**వచ్చే ఏడాది ఎన్నికల్లో మస్క్ పోటీ**

ఇక వచ్చే ఏడాది అమెరికాలో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో 2%-%3 సెనేట్ స్థానాలు, 8%-%10 ప్రతినిధుల సభ స్థానాల్లో ఎలాన్ మస్క్ పోటీ చేయనున్నారంటూ పలు నివేదికలు వెలుగులోకి వచ్చాయి. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడం, ప్రభుత్వ ఖర్చులను తగ్గించడం. తన పార్టీ ద్వారా ప్రజల గొంతుకను వినిపించడమే తన పార్టీ ఉద్దేశమనే నినాధాలతో ప్రజల్లోకి వెళ్లనుంది. అమెరికాలో ప్రతినిధుల సభ సభ్యుల పదవీకాలం కేవలం 2 సంవత్సరాలు.

## నేను మరాఠిలో మాట్లాడాలా.. ఇంగ్లిష్‌లోనా?: సీజేఐ

ముంబై

మహారాష్ట్రలో మరాఠీ ఉద్యమం తీవ్ర రూపం దాల్చిన తరుణంలో ఇప్పుడు ఆ భాష తప్పనిసరిగా మాట్లాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఇదే విషయంపై సీజేఐ బీఆర్ గవాయ్ సరదాగా స్పందించారు. ఈ రోజు(ఆదివారం, జూలై 6) ముంబైలోని తాను చదువుకున్న చిన్ననాటి స్కూల్‌ను సందర్భించిన గవాయ్.. స్కూల్ పిల్లలతో సరదాగా గడిపారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడే క్రమంలో మరాఠీ భాషలో మాట్లాడాలా? లేక ఇంగ్లిష్‌లో మాట్లాడాలా? అనే సందిగ్ధత ఆయనకు కూడా ఏర్పడింది. ‘ఇప్పుడు నేను మరాఠీలో మాట్లాడాలా?, లేక ఇంగ్లిష్‌లోనా?’ అని అక్కడున్న టీచర్‌ను అడిగారు. మేడమ్ అయితే మరాఠిలో చక్కగా మాట్లాడారు. కానీ తాను మరాఠీలో మాట్లాడితే అంతా అర్థం చేసుకుంటారు కదూ..? అని విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు

దీని తరువాత సీజేఐ గవాయ్.. తన ప్రసంగంలోని మిగిలిన భాగాన్ని మరాఠీలో కొనసాగించారు. తాను మాతృభాషలో మాట్లాడటంతో ఆయన అందరి దృష్టిని ఆకర్షించడమే కాదు .. ప్రశం?సల సైతం అందుకున్నారు. గవాయ్ తన ప్రసంగంలోని మిగిలిన భాగాన్ని మరాఠీలో కొనసాగించారు, తన మాతృభాషలో మాట్లాడటానికి ఎంచుకున్నందుకు అందరి దృష్టిని మరియు ప్రశంసలను పొందారు. మహారాష్ట్రలో మరాఠీ వాడకాన్ని అమలు చేయడం లేదా ప్రోత్సహించడం చుట్టూ రాజకీయాలు వేడెక్కుతున్న సమయంలో, ముఖ్యంగా ప్రముఖులు మరియు రాజకీయ నాయకులతో కూడిన ఇటీవలి వివాదాల తర్వాత ఆయన వ్యాఖ్యలు వచ్చాయి. తాను చదువుకున్న చికిత్సక్ సమూహ్ శిరోద్కర్ పాఠశాలలోని తరగతి గదులను కూడా సందర్శించారు. ఇక్కడ తన పూర్వ విద్యార్థులతో సమావేశమయ్యారు సీజేఐ. ఈ క్రమంలోనే మాతృభాషలో చదువుకోవడం వల్ల విషయం లోతైన అవగాహన ఏర్పడుతుందని, అది జీవితాంతం మనతో పాటే ఉండే అత్యంత అమూల్యమైనదిగా ఆయన అభివర్ణించారు.

## 23.30 లక్షలు చెల్లిస్తే గోల్డెన్ వీసా




దుబాయి

భారతీయులకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం బంపర్ ఆఫర్ ఇస్తోంది. కొత్త రకం గోల్డెన్ వీసాను అందిస్తోంది. స్థిరాస్థి లేదా వ్యాపారంలో భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేకుండా ఈ వీసాను పొందే అవకాశం కల్పిస్తోంది. నామినేషన్ ప్రాతిపదికన ఈ వీసాను ఇస్తోంది. ఇప్పటి వరకు దుబాయ్ గోల్డెన్ వీసాను భారతీయులు పొందడానికిగాను కనీసం రెండు మిలియన్ ఏఈడీల (రూ.4.66 కోట్లు) విలువైన ప్రాపర్టీలో పెట్టుబడి పెట్టాలి లేదా దేశంలోని వ్యాపారంలో భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టడం ఒక మార్గంగా ఉంది. అయితే ఇప్పుడు కొత్తగా నామినేషన్ ఆధారిత వీసా విధానం కింద భారతీయులు లక్ష ఏఈడీలు (దాదాపు రూ.23.30 లక్షలు) రుసుముగా చెల్లిస్తే జీవిత కాలానికి యూఏఈ గోల్డెన్ వీసా పొందవచ్చు. ఈ వీసాను పరీక్షించే నిమిత్తం మొదటి విడతలో భారత్, బంగ్లాదేశ్‌ను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. భారత్‌లో ఈ వీసా దరఖాస్తులను పరిశీలించేందుకు కన్సల్టెన్సీ సంస్థ రయాద్ గ్రూప్ ఎంపికైంది. ఈ గోల్డెన్ వీసా కోసం ఎవరైనా దరఖాస్తు చేయగానే మొదట తాము వారి నేపథ్యాన్ని పరిశీలిస్తామని, మనీలాండరింగ్, క్రిమినల్ రికార్డులతోపాటు వారి సోషల్ మీడియాను తనిఖీ చేస్తామని రయద్ గ్రూప్ ఎండీ రయాద్ కమల్ అయుబ్ పేర్కొన్నారు. ఆ తర్వాత రయాద్ గ్రూప్ ఆ దరఖాస్తును ప్రభుత్వానికి పంపుతుందని, అనంతరం నామినేషన్ ఆధారిత గోల్డెన్ వీసాపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. నామినేషన్ కేటగిరీలో యూఏఈ గోల్డెన్ వీసా పొందాలనుకునే వారు దుబాయ్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. గోల్డెన్ వీసాను పొందిన వారు తమ కుటుంబ సభ్యులను దుబాయికి తీసుకువెళ్లవచ్చు. ప్రాపర్టీ ఆధారితంగా తీసుకునే గోల్డెన్ వీసా సదరు ప్రాపర్టీని విక్రయిస్తే దాని కాలం ముగిసిపోతుంది. కానీ నామినేషన్ ఆధారిత వీసా జీవిత కాలం చెల్లుబాటు అవుతుంది.

## పనే చేయకుండా.. 12 ఏళ్లలో రూ.28 లక్షల జీతం

భోపాల్: ఓ కానిస్టేబుల్ 12 ఏళ్లపాటు ఎన్నడూ డ్యూటీ చేయకుండానే ఏకంగా రూ.28 లక్షల మేర వేతనం అందుకున్నాడు. వ్యవస్థ వైఫల్యం, యంత్రాంగం నిర్లక్ష్యానికి అద్దం పట్టే ఈ విడ్డూరం మధ్యప్రదేశ్ రాష్ట్రం విదిశ జిల్లాలో తాజాగా వెలుగు చూసింది. 2011లో ఓ వ్యక్తి కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికయ్యాడు. భోపాల్ పోలీస్ లైన్స్‌లో పోస్టింగ్ సైతం ఇచ్చారు. కొన్ని రోజులకే ఆ బ్యాచ్‌లో మిగతా వారితో కలిపి అతడిని కూడా సాగర్ పోలీస్ ట్రెయినింగ్ సెంటర్‌కు ప్రాథమిక శిక్షణ కోసం పంపించారు అధికారులు. ట్రెయినింగ్ సెంటర్‌కు వెళ్లకుండా, నేరుగా విదిశలోని తన ఇంటికి వెళ్లిపోయాడు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం, సెలవు కోరడం వంటివేమీ లేకుండా ఇంట్లోనే ఉండిపోయాడు. స్పీడ్ పోస్ట్ ద్వారా సర్వీస్ రికార్డును పోస్టింగిచ్చిన భోపాల్ పోలీస్ లైన్స్ స్టేషన్‌కు పంపించాడు. వాటిని అందుకున్న అధికారులు అందులోని వివరాలను, అతడి హాజరీని, శిక్షణ స్టేటస్‌ను గురించిన వివరాలనుగానీ చూడనే లేదు. అది మొదలు అతడిని కొత్తగా రిక్రూటైన కానిస్టేబుల్‌గా పరిగణిస్తూ నెలనెలా ఠంచనుగా బ్యాంకు అకౌంట్‌లో వేతనం జమ చేస్తున్నారు. ట్రెయినింగ్ సెంటర్ అధికారులు గానీ, భోపాల్ పోలీస్ లైన్స్‌లో గానీ అతడిని ఎవరూ పట్టించుకోలేదు. ఇలా 12 ఏళ్లు గడిచాక 2023లో అసలు విషయం వెలుగు చూసింది. 2011వ బ్యాచ్ వారికి పే గ్రేడ్ ఎవాల్యుయేషన్ సమయంలో అతడిని గురించి వాకబు చేయగా తామెన్నడూ చూడలేదని, ఎక్కడ పనిచేస్తున్నాడో తెలియదని చెప్పడంతో అవాక్కవడం అధికారుల వంతయింది. ఈ వ్యవహారంపై ఏసీపీ అంకితా ఖటెర్కర్‌కు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. ఆ కానిస్టేబుల్‌కు నోటీసులు పంపారు. విచారణకు హాజరైన అతగాడు తనకు మానసిక సమస్యలున్నాయని చెప్పాడు. ఇందుకు ఆధారాలను సమర్పించాడు. ప్రస్తుతం భోపాల్ పోలీస్ లైన్స్‌లోనే పనిచేస్తున్న ఇతడు రూ.1.5 లక్షలను తిరిగిచ్చేశాడు. మిగతా మొత్తాన్ని శాలరీ నుంచి ఇచ్చేందుకు అంగీకరించాడని ఏసీపీ అంకిత వివరించారు.

# మహెూన్నత పార్లమెంటేరియన్

భారత దేశ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేత జగ్జీవన్ రామ్. అతి చిన్న వయస్సులో (27 ఏళ్లకే) శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యి రికార్డు సృష్టించిన ప్రజానాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, బాబూ జగ్జీవన్ రాం. పొలిటికల్ కింగ్ మేకర్‌గా రాజకీయంలో రాణించి, అధికారం కోసం కాకుండా ప్రజా శ్రేయస్సు కోసమే పనే చేసిన మహెూన్నత వ్యక్తిత్వం ఆయన సొంతం. యాభై ఏళ్ళు పార్లమెంట్‌లో సభ్యునిగా కొనసాగిన సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రం, షాబాద్ జిల్లా, ఛాందా గ్రామంలో శిబిరం, బసంతి దేవి దంపతులకు జగ్జీవన్ జన్మించారు. ఆయన ఒక పేద దళిత కుటుంబంలో జన్మించడంతో ఎన్నో అవమానాలను, ఛీత్కారలను ఎదుర్కొన్నారు. చిన్ననాడే తండ్రి చనిపోవడంతో సాంఘిక, ఆర్థిక ఇక్కట్ల మధ్య తల్లి వసంతీదేవి సంరక్షణలో తన చదువు కొనసాగించారు. రాత్రింబవళ్ళు భోజ్‌పురితో పాటు హిందీ, ఇంగ్లీషు, బెంగాలి, సంస్కృత భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఇంటర్, కలకత్తా విశ్వ విద్యాయం నుంచి డిస్టింక్షన్‌లో బిఎస్సీ డిగ్రీ పూర్తి చేసి పట్టభద్రు డయ్యారు. పీజీ చదువు పూర్తి చేశారు. కార్మికుల కోసం పోరాడి 35వేల మంది కార్మికులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి అనేకమంది జాతీయ నాయకుల దృష్టిలో పడ్డారు. ఆయన జీవితకాలం 78 ఏళ్ళు అయితే అందులో 52 ఏళ్ళు రాజకీయ జీవితం గడిపారు. 1952లో భారత రిపబ్లిక్ తొలి లోక్‌సభ ప్రవేశించిన జగ్జీవన్‌రామ్ వరుసగా ఎనిమిది సార్లు గెలిచారు. ఏకధాటిగా 33 సంవత్సరాలు కేంద్రమంత్రిగా, దేశ ఉప ప్రధానిగా ఆయన ప్రత్యేకత చాటుకున్నారు. మొదటి శ్రేణి పార్లమెంట్ రియన్‌గా నిలిచారు. మంత్రి మండలిలో అతి చిన్న వయసుడ్కైన జగ్జీవన్‌రామ్‌ను అందరూ 'బేబి మినిష్టర్' అని పిలిచేవారు. ప్రజలంతా ప్రేమతో 'బాబుజీ' అని పిలిచేవారు. వ్యవసాయ శాఖ మంత్రిగా, ఆహార శాఖ మంత్రిగా, రైల్వే మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా ఎన్నో సేవలనందించిన ప్రగతిశీలి ఆయన. దామోదరం సంజీవయ్యను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చెయ్యటంలో కీలకపాత్ర పోషించారు. 1942లో కాంగ్రెస్ లో చేరి, జగ్జీవన్ 1969లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 1977లో ఇందిరా గాంధీతో



విభేదించి పార్టీ నుంచి బయటకు వచ్చి 'ప్రజాస్వామ్య కాంగ్రెస్' పార్టీ ఏర్పాటు చేశారు. ఇంద్రాణిదేవితో బాబుజీకి 1935 జూన్ 1న వివాహం జరిగింది. ఇంద్రాణి కూడా స్వాతంత్ర్య సమరయోధురాలు. ఆయన కుమార్తె మీరాకుమార్ తండ్రి ఆదర్శాలతోనే పెరిగి, ఆయన బాటలోనే కేంద్రమంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా దేశానికి సేవలందించారు. బాబుజీ గొప్ప రచయిత అన్న సంగతి చాలా మందికి తెలియదు. ఆయన హిందీలో, ఇంగ్లీషులో రచనలు చేశారు. "భారత దేశంలో కులం సవాళ్ళు", " జీవన సరళి వ్యక్తిత్వ వికాసం" అను రెండు విశిష్ట గ్రంథాలను రాశారు. ఆయన గొప్ప అధ్యయనశీలి. ఉజ్జయినిలోని విక్రమ విశ్వ విద్యాయం 1967లో జగ్జీవన్‌రామ్ కు 'డాక్టర్ ఆఫ్ సైన్స్' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన సేవను మెచ్చిన కాన్పూర్ విశ్వవిద్యాయం 1968లో డాక్టరేట్‌తో సత్కరించింది. జగ్జీవన్ రామ్ అమూల్యరత్నం" అని గాంధీ ఒక సందర్భంలో రాశారు. 1986 జూల్కై 6వ తేదీన బాబూజీ తన తుదిశ్వాస విడిచారు. బాబు జగ్జీవన్ రామ్ వరుసగా ప్రజాప్రతినిధిగా, భారత దేశంలో ఎక్కువ కాలం పనిచేసిన క్యాబినెట్ మంత్రిగా రికార్డు సృష్టించారు. ఆయన కేంద్ర కార్మిక మంత్రిగా 1946 నుండి 1952 సంవత్సరం వరకు ఉన్నారు. ఆయన 1952 నుండి 1956 సంవత్సరం వరకు కేంద్ర సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. 1956 నుండి 1962 వరకు కేంద్ర రవాణా, రైల్వే శాఖ మంత్రిగా పనిచేశారు. 1962 నుండి 1963 సంవత్సరం వరకు ఆయన కేంద్ర రవాణా మరియు సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. 1966 నుండి 1967 సంవత్సరం వరకు కేంద్ర కార్మిక, ఉపాధి మరియు పునరావాస శాఖ మంత్రిగా పని చేశారు. 1967 నుండి 1970 వరకు కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నారు. 1970–1974, 1977 – 1979 కేంద్ర రక్షణ మంత్రిగా ఉన్నారు. 1974 నుండి 1977 వరకు కేంద్ర వ్యవసాయ, నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నారు. సెప్టెంబర్ 1976 నుండి 1983 ఏప్రిల్ వరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షుడిగా పని చేశారు. భారత ఉప ప్రధాన మంత్రిగా, 1977 మార్చి 24 నుండి 1979 జూలై 28 వరకు విధులు నిర్వర్తించారు.

# జునోటిక్ వ్యాధులతో జర జాగ్రత్త !

అనాదిగా మనిషికి, పశుపక్ష్యాదులకు మధ్య అవిభాజ్య సంబంధం బలపడింది. గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో ఎడ్లు, బర్రెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, పిల్లులు, బాతులు, పక్షులు, గుర్రాలు, పందులు, కుందేళ్లు మొదలైన పెంపుడు జంతువులు భాగమై ఉంటాయి. ఈ పెంపుడు జంతువులతో మానవులు ప్రేమను పంచుకుంటూ, వాటిని కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వాటి ఆలనాపాలనా చూసుకుంటూ, ఎత్తుకొని ముద్దు చేస్తూ, భుజాన వేసుకొని తిరుగుతూ ఉంటారు. ఇలాంటి సాదు జంతువులు వ్యాధికారక సూక్ష్మజీవులైన బ్యాక్టీరియా, వైరస్, ఫంగీ, పరాన్నజీవులతో ఇన్ఫెక్ట్ అయితే ఆయా జంతువుల నుంచి మానవులకు కొన్ని ప్రమాదకర వ్యాధులు సంక్రమిస్తాయి. ఈ విధంగా జంతువుల నుంచి మనుషులకు (జునోటిక్) లేదా మనుషుల నుంచి జంతువులకు సంక్రమించే (రివర్స్ జునోటిక్) వ్యాధులను "జునోటిక్ వ్యాధులు"గా పిలుస్తాం. దాదాపు 130 రకాల సూక్ష్మజీవులు, 60 వరకు పరాన్నజీవుల వల్ల దాదాపు 250 రకాల జునోటిక్ వ్యాధులు సోకుతాయని వెల్లడయ్యింది. . ప్రుంచవ్యాప్తంగా 114కు పైగా దేశాల్లో జునేటిక్ వ్యాధుల బెడద అధికంగా నమోదు అవుతున్నాయి. ప్రతి 10 వ్యాధుల్లో 6 జునోటిక్ సంబంధ వ్యాధులే ఉన్నాయని తెలుస్తున్నది. జునోటిక్ వ్యాధుల పట్ల సంపూర్ణ అవగాహన, నివారణ చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలను చర్చించే వేదికలుగా ప్రతి ఏట 06 జూలై రోజున "ప్రపంచ జునోసిస్ దినం (వరల్డ్ జునోసిస్ డే)" పాటించనట ఆనవాయితీగా మారింది. 06 జూలై 1885 రోజున "లూయీ పాశ్చర్" అను ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు తొలిసారి పిచ్చి కుక్క కరిచిన వ్యక్తికి ఆంటీ రాబిస్ టీకా ఇవ్వడం జరిగింది. ఈ విప్లవాత్మకమైన ఘనతకు గుర్తుగా ప్రతి ఏట 06 జూలైన ప్రపంచ జునోసిస్ దినం పాటించడం పరిపాటి అయ్యింది. ప్రపంచ జునోసిస్ దినం–2025 ఇతివృత్తంగా "ఒకే ప్రపంచం, ఒకే ఆరోగ్యం : జునోటిక్ వ్యాధులను నిరోధించడం (వన్ వరల్డ్, వన్ హెల్త్ : ప్రివెంట్ జునోసిస్)" అను అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం ప్రకారం 61 శాతం వ్యాధులు జునోటిక్ సంబంధమైనవే అని, దాదాపు 1400 వ్యాధికారక సుక్ష్మజీవులు లేదా పాథోజెన్స్ పలు రకాల జంతువులను ఇన్ఫెక్ట్ చేస్తాయని, గత దశాబ్ద కాలంలో కరోనా లాంటి 75 శాతం కొత్త జునోటిక్ వ్యాధులే ఉన్నాయని తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 మిలియన్ల ప్రజలు సాదు జంతువులతో సహజీవనం చేస్తున్నారు. ఈగలు, దోమలు, పేలు, కీటకాలతో కూడా జునోటిక్ వ్యాధులు సంక్రమించవచ్చు. గతంలో మిలియన్ల ప్రజల మరణాలకు కారణం అయిన బొవైన్ టిబీ, బుబోనిక్ ప్లేగ్, గ్లార్స్, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు కూడా జునోటిక్ సంబంధమైనవా మాత్రమే అని తెలుసుకోవాలి. ప్రత్యక్షంగా వ్యాధికారక బ్యాక్టీరియా లేదా వైరస్ సోకిన పెంపుడు జంతువుల లాలాజలం, మూత్రం, మలం, రక్తం, శ్లేష్మం లాంటివని మనుషులు తాకినపుడు జునోటిక్ వ్యాధులు సోకుతాయి. పెంపుడు జంతువులను తాకినా, సమీపంలో గడిపినా, గోర్లతో గీకినా కూడా ఈ వ్యాధులు రావచ్చు. కలుషిత, పూర్తిగా ఉడకని ఆహారం (మాంసం, గుడ్లు, పాలు, జంతువులు ముట్టిన పండ్లు) తీసుకున్నపుడు కూడా ఈ వ్యాధులు రావచ్చు. పచ్చి పాలు తాగినా జునేచిక్ వ్యాధులు రావచ్చని, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులకు కూడా జునోటిక్ వ్యాధులు సులభంగా సోకుతాయి. భారత్‌లో



జునోటిక్ వ్యాధుల బెడద అధికంగా కనిపిస్తున్నది. సాదు జంతువులు, జంతు ప్రయోగశాలలు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, పశు వైద్యులు, చర్మం/తోళ్ళ పరిశ్రమలు, ధాన్య గిడ్డంగులు జునోటిక్ వ్యాధులకు కారణాలుగా నిలుస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. పాడి పంటలు, సాదు జంతువులే జీవనోపాధులుగా గడుపుతున్న పేద కుటుంబాలకు జునోటిక్ వ్యాధుల సమస్యలు అధికంగా ఉంటున్నాయి. జునోటిక్ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. జంతువులను తాకిన ప్రతిసారా చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. దోమలు, ఈగలు లాంటివని రాకుండా జాగ్రత్త పడాలి. పచ్చి పాలు తాగడం మానేయాలి. ఆహారాన్ని పూర్తిగా ఉడికించాలి. వంట సామాగ్రిని శుభ్రంగా కడగాలి. చనిపోయిన జంతువులను భూమిలో పాతి పెట్టాలి. జంతువులను తాకు సందర్భాల్లో మాస్కులు, చేతి గ్లౌజులు ధరించాలి. అధిక కాలం ఫ్రిజ్‌లో నిలువ ఉంచిన ఆహారాన్ని తీసుకోరాదు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. జంతు మలమూత్రాలతో నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. త్రాగే నీటిని మరిగించి వాడాలి. గర్భిణులు, శిశువులు, వృద్ధులు, అవయవ మార్పిడి చేయించుకున్న వారు, మధుమేహం గల వారు, ఆల్కహాల్ సేవించే వారు జునోటిక్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి. పెంపుడు జంతువులతో జాగ్రత్తగా మసులుకుంటూ, జీవనోపాధులను పొందుతూ, జునోటిక్ వ్యాధులకు దూరంగా, ఆరోగ్యకర కుటుంబాలకు దగ్గరగా జీవిద్దాం, జంతు సంబంధ వ్యాధులను పొలిమేరలు దాటిద్దాం. .

## హైదరాబాదీ క్రికెట్ ఆల్ రౌండర్ జయసింహ

భారత దేశంలో క్రికెట్ అంతగా ప్రాచుర్యం పొందని రోజుల్లోనే స్టైలిష్ క్రికెటర్ గా తెరపైకి వచ్చిన సాటిలేని మేటి హైదరాబాదీ క్రికెట్ లెజెండ్ ఎం. ఎల్.జయసింహ. పదిహేనేళ్ల వయసులోనే హైదరాబాద్ జట్టు తరపున ఆంధ్రప్రదేశ్ జట్టుపై ఆడిన తొలి మ్యాచ్ లో తొంభై పరుగులు సాధించి, అందరి దృష్టినీ ఆకర్షించాడు. క్రికెట్ ప్రపంచంలో "కలివేటెడ్ స్టైలిస్ట్'గా గుర్తింపు పొందిన ఎం.ఎల్.జయసింహగా చిరపరిచితులైన మోటగానహళ్ళి లక్ష్మీనరసు జయసింహ సికింద్రాబాద్ లో 1939 మార్చి 3న జన్మించాడు. అయన చదువు సంధ్యలన్నీ ఇక్కడే సాగాయి, హైదరాబాద్ జట్టు తరపునే ఫస్ట్ క్లాస్ క్రికెట్ లో అరంగేట్రం చేశాడు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.... ఇలా అన్ని అంశాల్లోనూ రాణించి ఆల్ రౌండర్‌గా సత్తా చాటుకున్నాడు. క్రికెట్లో ఇప్పటి రికార్డులతో పోల్చి చూస్తే జయసింహ రికార్డులు పెద్దగా అనిపించక పోవచ్చు. అయితే, అప్పటి పరిస్థితుల్లో ఆయన సాధించిన రికార్డులు తక్కు వేమీ కాదు. అప్పట్లో ఆధునిక క్రికెట్ కోచింగ్ సౌకర్యాలు అంతంత మాత్రమే. ఇప్పటిలా అప్పట్లో క్రికెటర్లకు ఆకర్ష ఆకర్షణీయమైన ఆదాయావకాశాలు ఉండేవి కాదు. అలాంటి పరిస్థితుల్లో రాణించడం అంత తేలిక కాదు. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో తొలి మ్యాచ్లోనే తొంభై పరుగులతో శుభారంభం చేసిన జయసింహ, ఆ తర్వాత మద్రాస్, మైసూరు జట్లతో ఆడిన మ్యాచ్లలో సెంచరీలు కొట్టాడు. అదే సీజన్లో రంజీ మ్యాచ్ లలో పౌలర్‌గా కూడా రాణించి, ఇరవై వికెట్లు తీసి, 1959లో ఇంగ్లండ్ కు వెళ్లిన భారత క్రికెట్ జట్టులో చోటు సంపాదించు కున్నాడు. లార్డ్స్ మైదానంలో తొలి అంతర్జాతీయ టెస్ట్ ఆడాడు. తొలి టెస్ట్ లో విఫలమైనా, ఆ తర్వాతి రెండు టెస్ట్ మ్యాచ్ లలోనూ రాణించి, క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించాడు. ఒక టెస్ట్ మ్యాచ్ లో వరుసగా ఐదురోజులూ బ్యాటింగ్ చేసిన తొలి క్రికెటర్ గా జయసింహ ఘనత సాధించాడు. ప్రపంచంలో ఈ ఘనత సాధించిన తొలి క్రికెటర్ జయసింహ అయితే, ఈ ఘనత సాధించిన రెండో భారత క్రికెటర్ రవిశాస్త్రి. ఆస్ట్రేలియా జట్టుపై 1960లో కలకత్తాలో ఆడిన మ్యాచ్ లో జయసింహ తొలిరోజు ఆట ముగిసే సమయంలో బ్యాటింగ్ ప్రారంభించాడు. రెండో రోజు ఇరవై పరుగుల వద్ద ఉండగా, ఇన్నింగ్స్ డిక్లేర్ చేశారు. సెకండ్ ఇన్నింగ్స్ లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి మళ్లీ బ్యాటింగ్ అవ కాశం వచ్చింది. నాలుగో రోజంతా బ్యాటింగ్ చేసి 59 పరుగులు చేశాడు. చివరిగా ఐదో రోజు 74 పరుగుల వద్ద ఔటయ్యాడు, రెండేళ్ల తర్వాత పాకిస్తాన్ జట్టుపై కాన్పూర్ లో ఆడిన టెస్ట్ మ్యాచ్ లో ఒక సింగిల్ రన్ కోసం తొందర పడి 99 పరుగుల వద్ద ఔటయ్యాడు. తొలి నాళ్లలో మిడిల్ ఆర్డర్ బ్యాట్స్ మన్ గా ఉన్న జయసింహ, క్రమంగా ఓపెనర్‌గా ఎదిగాడు. ఓపెనర్‌గానే ఇంగ్లాండ్, శ్రీలంక జట్లపై సెంచరీలు చేశాడు. వెస్ట్ ఇండీస్ పై 1970 – 71 లో చివరి టెస్ట్ సిరీస్ ఆడిన జయ సింహ, జూనియర్లకు మార్గదర్శిగా ఉండేవాడు. ఆటలో జయసింహ ఇచ్చిన సలహాలు విలువైనవని మాజీ కెప్టెన్ అజిత్ వాడేకర్ కొనియాడటమే ఇందుకు నిదర్శనం. మరో మాజీ కెప్టెన్ నవాబ్ మహమ్మద్ మన్సూర్ అలీఖాన్ పటౌడీ (టైగర్ పటౌడీ) సైతం జయసింహ నాయకత్వంలో పలు మ్యాచ్ లు ఆడాడు. 'లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ బ్యాటింగ్ శైలిలో జయసింహనే గురువుగా పరిగణించేవాడు. క్రికెటర్ గా విరమించుకున్నాక కొన్నాళ్లు సెలెక్టర్ గా, శ్రీలంక పర్యటనలో భారత జట్టుకు మేనేజర్ గా వ్యవహరించాడు. కొన్నాళ్లు కామెంటేటర్ గానూ ఆటతో బాంధవ్యాన్ని కొనసాగించిన జయసింహ, 1999 జూలై 6న లంగ్ కేన్సర్ తో సైనిక్ పురిలోని తన నివాసంలో కన్ను మూశాడు. జయసింహ 39 టెస్టు మ్యాచులలో 2056 పరుగులు చేసి, 30.68 బ్యాటింగ్ సరాసరి సాధించాడు. 3 సెంచరీలు, 12 అర్ధ సెంచరీలు సాధించి, 129 అత్యధిక స్కోరు సాధించాడు. అలాగే 2097 బంతులు బౌలింగ్ చేసి, 92.11 బౌలింగ్ సరాసరితో 9 వికెట్లు సాధించాడు.

# మూడో అతిపెద్ద ఎకానమీ దేశంగా భారత్

ప్రపంచవ్యాప్తంగా యుద్ధ మేఘాలు కమ్ముకున్నా, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా భారత్ మాత్రం జీడీపీలో దూసుకెళ్తోంది. అగ్రదేశాల జీడీపీ ఎలా ఉన్నా భారత ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతోందని ప్రపంచ సంస్థలే చెబుతున్నాయి. ఇటీవలే జపాన్ ను అధిగమించి ప్రపంచంలోనే నాలుగవ ఆర్థిక వ్యవస్థగా ఇండియా అవతరించింది. 2030 నాటికి జర్మనీని సైతం అధిగమించి మూడో అతిపెద్ద ఎకానమీ దేశంగా భారత్ నిలుస్తుందని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా 77వ ఫౌండేషన్ డే వేడుకల్లో ఆయన ప్రసంగించారు. గత 11 ఏళ్లలో మన దేశ జీడీపీ డబుల్ అయ్యిందని చెప్పారు. 2014లో దేశ జీడీపీ 2.1 ట్రిలియన్ డాలర్లుగా ఉంటే 2025లో అది 4.3ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. మోడీ చేపట్టిన సంస్కరణల వల్లే ఇది సాధ్యమైందన్నారు. పేదల అభ్యున్నతి కోసం మోడీ ఎన్నో పథకాలు తీసుకొచ్చినట్లు తెలిపారు. మోడీ స్కీమ్ లతో 27 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని హర్దీప్ సింగ్ పూరీ అన్నారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన కింద 4 కోట్ల మందికి ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా 15.4 కోట్ల మందికి నల్లా కనెక్షన్ల ద్వారా తాగు నీరు అందిస్తున్నామని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ స్కిమ్ తో 70కోట్ల మందికి రూ.5లక్షల బీమా అందిస్తున్నామన్నారు. ఇవన్నీ దేశాభివృద్ధికి మోడీ ప్రభుత్వ నిబద్ధతకు అద్దం పడుతున్నాయని చెప్పారు. అంతేకాకుండా విదేశీ పెట్టుబడులను సాధించడంలో భారత్ సక్సెస్ అయ్యిందని పూరీ అన్నారు. ఇది గత దశాబ్దంతో పోలిస్తే 143శాతం పెరిగిందన్నారు. వార్షిక ఆదాయపు పన్ను రిటర్న్‌లు 2013–14 ఆర్థిక సంవత్సరంలో 3.6 కోట్లుగా ఉంటే.. 2024–25 ఆర్థిక ఏడాదిలో 8.5 కోట్లకు పెరిగాయని తెలిపారు. భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని ఏఐ సాంకేతికతను వాడుకుంటూ చార్టెడ్ అకౌంటెంట్స్ ముందుకు సాగాలని సూచించారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక ప్రపంచంలో అగ్రస్థానంలో నిలవాలంటే ఇది చాలా అవసరమని హర్దీప్ సింగ్ పూరీ నొక్కి చెప్పారు. 2030 నాటికి భారత్ మరింత బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగనుంది. ఎస్ అండ్ పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ఈ విషయాన్ని తెలిపింది. 2030 నాటికి 7.3 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగనుందని తెలిపింది. జపాన్‌ను వెనక్కి నెట్టి ఆసియాలో అదిపెద్ద రెండో ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందని ాడఖ గ్లోబల్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ తన తాజా పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ తన నివేదికలో తెలిపింది. ఇదిలా ఉంటే 2021, 2022లో వేగవంతమైన ఆర్థిక వృద్ధి తర్వాత, భారత ఆర్థిక వ్యవస్థ 2023 ఆర్థిక సంవత్సరంలో బలమైన వృద్ధిని చూపుతూనే ఉంది.ాడఖ గ్లోబల్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ అంచనా ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 6.2 నుంచి 6,3 శాతం పెరగనుందని చెబుతోంది. దీంతో భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది. ఆసియాలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో 7.8 శాతంగా ఉంది. ఈ లెక్కన ఆర్థిక వ్యవస్థ ఇలాగే వృద్ధిలో కొనసాగితే.. భారత్ రెండో స్థానంలోకి రావడం ఖాయంగా తెలుస్తోంది. దేశీయంగా డిమాండ్‌లో బలమైన వృద్ధి కనిపిస్తుండడం సానుకూల అంశమని ఎస్ అండ్ పీ చెబుతోంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగల దేశంగా అమెరికా అగ్ర స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. ఆ తర్వాత చైనా రెండో స్థానంలో ఉండగా, మూడో స్థానంలో జపాన్ ఉంది. అయితే ప్రస్తుతం భారత్‌లో కనిపిస్తున్న వృద్ధి ఇలాగే కొనసాగితే 2030 నాటికి భారతదేశ జీడీపీ జర్మనీని అధిగమిస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక 2039 నాటికి భారత్‌లో 110 కోట్ల మంది భారతీయులకు ఇంటర్‌నెట్ లభించనుందని, 5జీ నెట్‌వర్క్ అందుబాటులోకి రాకవడంతో దేశంలో ఇ–కామర్స్ గణనీయంగా 4జీ నుంచి 5జీ సాంకేతికతకు మారడంతో ఇ–కామర్స్ గణనీయంగా వృద్ధి చెందనుంది.. ఈ ఏడాది వృద్ధికి... బలమైన దేశీయ గిరాకీ, తయారీ, సేవల రంగాల నుంచి మద్దతు లభిస్తుందని పేర్కొంది. చైనాలో ప్రభుత్వ మౌలిక సదుపాయాల పెట్టుబడులు, ప్రైవేట్ పెట్టుబడుల కొరతను పాక్షికంగా భర్తీ చేస్తున్నాయని వివరించింది. అయితే స్థిరాస్తి రంగంలోని సవాళ్ల వల్ల ఆ దేశ ఆర్థిక వ్యవస్థలో ఎదురు గాలులు వీస్తున్నాయని ఐరాస నివేదిక స్పష్టం చేసింది. భారత్‌లో మాత్రం ప్రభుత్వ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు,బహుళజాతి కంపెనీల పెట్టుబడుల్లో గణనీయంగా వృద్ధి నమోదైందని గుర్తుచేసింది. ఆర్థిక కార్యకలాపాల తీరును తెలియజేసే..మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్–ఖఓఎ2023 మూడో త్రైమాసికంలో ఒక్క భారత్ మినహా ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలన్నింటిలో క్షీణించిందని వెల్లడించింది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల కంటే అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే పెట్టుబడులు బలంగా ఉన్నాయని పేర్కొంది. భారత్‌లో 2023లో పెట్టుబడుల సెంటిమెంట్.బలంగానే ఉందని తెలిపింది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు తమ సరఫరా గొలుసులను మారుస్తుండడంవల్ల అనేక దేశాలు భారత్‌ను ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా చూస్తున్నాయని ఐరాస నివేదిక విశదీకరించింది. ఇది భారత్‌కు కలిసొస్తోందని విశ్లేషించింది. 2023లో ప్రకృతి విపత్తులు దక్షిణాసియా ప్రాంతాన్ని ప్రభావితం చేశాయన్న ఐరాస నివేదిక జులై, ఆగస్టులో భారత్, నేపాల్., బంగ్లాదేశ్‌లో చాలాప్రాంతాలు అనావృష్టిని ఎదుర్కొన్నాయని తెలిపింది. భారత్‌లో ఆగస్టు నెలలో గత నాలుగు దశాబ్దాల్లోనే అత్యంత తక్కువ వర్షపాతం నమోదైందని, ఈ కారణంగా ప్రధాన పంటల ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడిందని గుర్తుచేసింది. ఈ పరిణామాలు వృద్ధిరేటుపై కొంత ప్రభావం చూపాయని తెలిపింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కొనసాగుతున్న అనిశ్చితి నేపథ్యంలో జీడీపీ? వృద్ధి 2023లో 2.7 శాతం నుంచి 2024లో 2.4 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 2023లో మాంద్యం ముప్పు తప్పినప్పటికీ దీర్ఘకాలం తక్కువ వృద్ధిరేటుతో సరిపెట్టుకోవాల్సి రావచ్చని అంచనా వేసింది

# శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానంలో ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు





-20వ బోనొత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లక్ష్మీ దంపతులు

-జూలై 12నుండి14 వరకు శ్రీ ఆందోల్ మైసమ్మ బోనోత్సవాలు

**చౌటుప్పల్.జులై06. ప్రభాత సూర్య:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, దండు మల్కాపురం గ్రామ పరిధి జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ ఆందోల్ మైసమ్మ ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లక్ష్మీ దంపతులు ఆదివారం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీ ఆంధోల్ మైసమ్మ ఆలయానికి విచ్చేసిన రాజ గోపాల్ రెడ్డి లక్ష్మి దంపతులకు ఆలయ పండితులు, ఆలయ కార్య నిర్వహణ అధికారి సల్వాది మోహన్ బాబు, దేవాలయ కమిటీ చైర్మన్ చిలుకూరు మల్లారెడ్డి, డైరెక్టర్లు, ధర్మకర్తలు,స్థానిక నాయకులు వారికి ఘనంగా ఆహ్వానం పలికారు.తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లక్ష్మి దంపతుల పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం శ్రీ ఆందోల్ మైసమ్మ ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులు జులై 12 నుండి 14 వరకు జరిగే శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థాన 20వ బోనోత్సవ ఆహ్వాన పత్రికను వారి చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు,మాజీ జెడ్పిటిసి సభ్యులు చిలుకూరి ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎంపీపీ తాడూరు వెంకటరెడ్డి,బోయ దేవేందర్,సుర్వి నరసింహ గౌడ్,మాజీ కౌన్సిలర్లు, ఆలయ ధర్మకర్తలు బుర్ర స్వామి,అత్తాపురం అంజిరెడ్డి,చిట్టంపల్లి జంగయ్య,కంచర్ల ప్రవీణ్ రెడ్డి,సోమ రాఘవేందర్ రెడ్డి,ఎలవర్తి రవీందర్, గుండ్ల అశోక్,ఎల్లంకి రమేష్ చారి,సంగం యాదమ్మ మల్లేష్ , ఫకీరు గణేష్ రెడ్డి చేపూరి మహేష్ , ఈదుదుల లింగస్వామి, పబ్బు కిరణ్ గౌడ్, ఆలయ అర్చకులు శివ ప్రసాద్ శర్మ, సిబ్బంది ఏ సత్తిరెడ్డి,గ్రామ, మండల, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ నేటి యువతకు ఆదర్శనీయుడు





డివిజన్ కార్పొరేటర్ మొండ్ర సంగీత గౌరీ శంకర్, బీజేపీ నాయకులు నారగూడెం మల్లారెడ్డిలు

**గండిపేట్, : సూర్య ప్రతినిధి** డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ నేటి యువతకు ఆదర్శనీయుడని డివిజన్ కార్పొరేటర్ మొండ్ర సంగీత గౌరీ శంకర్, బీజేపీ నాయకులు నారగూడెం మల్లారెడ్డిలు అన్నారు. ఆదివారం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సులిగె వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం తర్వాత భారత్‌లో జమ్మూ కశ్మీర్ రాష్ట్ర విలీనం సందర్భంగా ప్రధాని నెహ్రూ అనుసరించిన దాగుడు మూతల వైఖరితో సమస్య రాచపుండులా మారిందన్నారు. తన మిత్రుడు షేక్ అబ్దుల్లాకు అధికారం కట్టబెట్టే ఆలోచనలో భాగంగా భారతదేశంలో ఏ రాష్ట్రానికి లేని ప్రత్యేకతలను ఆర్టికల్ 370 రూపంలో నెహ్రూ రక్షణ కల్పించారన్నారు. అవన్నీ పాకిస్తాన్‌కు అనుకూలంగా ఉండడమే కాకుండా కశ్మీరీలు మిగతా భారతీయ సమాజంతో కలవకుండా ఆర్టికల్ 370 అడ్డుపడేదన్నారు. ఏక్ దేశ్‌మే దో ప్రధాన్, దో నిశాన్, దో విధాన్ నహీ చలేగా.. నహీ చెలాగా.. అంటూ ఆర్టికల్ 370ని రద్దు కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని జనసంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించారన్నారు. జమ్మూ కశ్మీర్‌ను భారత దేశంతో సంపూర్ణంగా కలిపే మహా యజ్ఞంలో సమిధగా ఆహుతయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొమురయ్య, ప్రణవ భక్త సమాజం అధ్యక్షులు నరసింహ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కాడెం సుధాకర్, అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ విజయకుమార్, బీట్కూరి సిద్దేశ్వర్, జయానంద రెడ్డి, జి రాజు, నరేష్, పుల్లారెడ్డి, జైపాల్ రెడ్డి, అశోక్, సతీష్, రవీందర్ రెడ్డి, బాలకృష్ణ, విమల్ శర్మ, అమృత, శ్రీను, వినోద్, ముఖేష్, బిలాదర్ రాంబాబు, సాదేవ్ రెడ్డి, కే రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ మరియు అంతర్గత సిసి రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయండి

వివిధ ప్రజా సమస్యలపై శాసన సభ్యులు రాజగోపాల్ రెడ్డి కి వినతి పత్రం అందచేసిన విద్యార్థి నాయకుడు మాజీ ఎంపీటీసీ సిలివేరు విష్ణు



**ప్రభాత సూర్య (మర్రిగూడ)** మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి గ్రామ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి విద్యార్థి నాయకుడు మాజీ ఎంపీటీసీ సిలివేరు విష్ణు వినతి పత్రం అందచేశారు ఈ సందర్బంగా మునుగోడు క్యాంపు కార్యాలయంలో సిలివేరు విష్ణు కలిశారు ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దామెర భీమనపల్లి గ్రామంలో రోడ్లు చెడిపోవడం వలన వర్షం పడితే నీరు నిల్వ ఉండి ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని అదేవిదంగా దోమలు, ఈగలు వాలి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉన్నదని అన్నారు అందుకని అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని డ్రైనేజ్ మరియు అంతర్గత సి, సి రోడ్లకు నిధులు మంజూరు చేయాలనీ కోరారు అదేవిదంగా

1,దామెర భీమనపల్లి గ్రామం నుండి తండా సరంపేట, శివన్నగూడ వరకు రోడ్డును త్వరితగతిన పనులు పూర్తి చేయగలరు

2, గ్రామం నుండి తానేదార్ పల్లి రోడ్ వెంట వందల మంది రైతులు మరియు ప్రయాణికులు వెళుతుంటారు ఆ రోడ్ పూర్తిగా చెడిపోయి ప్రజల రాకపోకలకు ఇబ్బంది గ మారింది కాబట్టి ఆ రోడ్డును బి, టి. రోడ్ గ మార్చాలి

3, గ్రామం నుండి పెద్దమ్మ గుడి రోడ్డు కు మరమ్మత్తులు చేపట్టాలి

4,గ్రామం నుండి గంగాభవాని గుడి రోడ్డు కు నిధులు కేటాయించాలి

5,గ్రామానికి ఇంచార్జి గ్రామ పంచాయతీ కార్యదర్శి కావడం తో గ్రామ సమస్యలను పట్టించుకోకపోవడం వలన పారిశుధ్యం లోపించింది కావున రెగ్యులర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిని నియమించగలరు

6, గ్రామంలో వీధి లైట్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు కావున వీధి దీపాలను అమరచ్చుటకు చర్యలు తీసుకోగలరు

అదేవిదంగా నల్గొండ నుండి చండూర్ దామెర భీమనపల్లి గ్రామం మీదుగా మర్రిగూడ, మాల్ కు విద్యనబ్యసించుటకు వెళ్లే విద్యార్థులకు పాఠశాలల మరియు కళాశాల ల సమయానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు కాబట్టి సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు అన్ని సమస్యలతో కూడుకున్న వినతి పత్రాన్ని శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి సిలివేరు విష్ణు వినతి పత్రం అందచేసారు ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కచ్చితంగా గ్రామ అభివృద్ధి సహకరిస్తానని హామీ ఇచ్చారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం :

సిల్వర్ జూబ్లీ వేడుకలు (1998-99 బ్యాచ్) 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా....



**ప్రభాత సూర్య (మర్రిగూడ)** మర్రిగూడ: మర్రిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు (1998-99 బ్యాచ్) ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం రోజున హైదరాబాదులోని కర్మనఘాట్ శుభం కన్వెన్షన్ హాల్లో ఘనంగా జరుపుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకుంటూ నాటి స్మృతులను చిన్ననాటి బాల్యంలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంతో ఉప్పొంగారు. అప్పుడే మన బ్యాచ్ 26 సంవత్సరాలు అయిపోయిందంటే నమ్మలేకుంటున్నామని ఒకరికొకరు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంతో పులకరించిపోయారు. మన బ్యాచ్ సభ్యులకు ఎవరికైనా ఎలాంటి ఆపద ఉన్న ఒకరికొకరు తోడున్నామంటూ ఒక నిధిని ఏర్పాటు చేసుకొని రానున్న భవిష్యత్తు కాలంలో వారి అవసరాలను చేదోడు వాదోడుగా ఉండాలని ప్రతి ఒక్కరూ ఆపద సమయంలో మనం ఉన్నాము అనే భరోసాను కల్పించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి,, ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి,, నరేందర్ రెడ్డి,, మల్లప్ప,, గులాంనబి మమ్మద్,, జీవిత,,పూర్వ విద్యార్థులు మాధవాచారి,, భావనాఋషి,, ప్రభాకర్,, ఆకుల సాయికుమార, గిరి ప్రసాద్,, ,కట్కూరి ఆంజనేయులు,, గునుగంటి యాదయ్య,, ఈద కృష్ణ,, కొడిచెర్ల రవి,, గుడ్డేటి యాదగిరి,, నీలమహేశ్వర్,, సతీష్ రెడ్డి,, వెంకటయ్య,,,, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## జగ్జీవన్ రామ్ నేటి యువతకు ఆదర్శనీయుడు

రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ నేటి యువతకు ఆదర్శనీయుడని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం (రాజేంద్రనగర్ బుద్వేల్) అంబేద్కర్ చౌరస్తాలో, అరాంఘర్ చౌరస్తాలో నిర్వహించిన స్వాతంత్ర సమరయోధుడు, అణగారిన వర్గాల అభ్యునతి కోసం పాటు పడిన సామాజిక న్యాయ సాధకుడు భారత ఉప ప్రధాని, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రదేశం కోసం తమ ప్రాణాలు సైతం అర్పించిన మహానుభావుడు బాబు జగ్జీవన్ రామ్ అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ ఆశ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రావు ఉత్సవ కమిటీ సభ్యులు ముఖ్య నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## దేశ ఐక్యత కోసం పోరాడిన యోధుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ

- రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి




**గండిపేట్, : సూర్య ప్రతినిధి** శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ దేశ జాతీయ ఐక్యత, దేశ ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడిన మహానీయుడని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కటేదాన్ బీజేపీ పార్టీ కార్యాలయంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, బాబు జగ్జీవన్ రామ్ ల వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్ యాదవ్, సీనియర్ నాయకులు జోగి రవి, డివిజన్ మాజీ అధ్యక్షుడు అడికే జనార్ధన్, బుచ్చి రెడ్డి, బీ.నరసింహ, ఎన్.జగన్, వెంకట్ రమణ గుప్తా, బబ్లూ, ఎల్వీ రెడ్డి, గోపాల్ నాయక్, ఈ రవి, జీ.మోహన్, రమేశ్ రెడ్డి, కుర్మయ్య, రామారావు, ఏ.శేఖర్, రాజు స్వామి, బాబు రావు, శంకర్, కిరణ్, ఉత్తమ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## హైదర్ షా కోట్ బోనాల కమిటీ చైర్మెన్ గా చింతల వెంకటేష్



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** ఆషాడం బోనాలను హైదర్ షా కోట్లో ఘనంగా నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తామని నూతన బోనాల కమిటీ చైర్మెన్ చింతల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా హైదర్షాకోట్ గ్రామంలో నూతన బోనాల కమిటీని ఏర్పాటు చేశారు. ఆదివారం బోనాల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ చైర్మన్ గా చింతల వెంకటేష్ ముదిరాజ్, వైస్ చైర్మన్ లు కడారి రవికాంత్ రెడ్డి, చేవెళ్ల నవీన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పూర్ణం నర్సింగరావు, జాయింట్ సెక్రటరీ చింతల నర్సింహ, కోశాధికారి సింగీతం దశరథ్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన బోనాల కమిటీ సభ్యులను మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో హైదర్షాకోట్ మాజీ కార్పొరేటర్ లు, గ్రామంలోని పెద్దలు పాల్గొన్నారు.

## జగ్జీవన్ రాం, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీల సేవలు చిరస్మరణీయం




**గండిపేట్, : సూర్య ప్రతినిధి** జగ్జీవన్ రాం, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీల సేవలు చిరస్మరణీయమని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్ యాదవ్ అన్నారు. జగ్జీవన్ రాం వర్ధంతి, శ్యామా ప్రసాద్ ముఖర్జీల జయంతి, మోదీ ప్రభుత్వ 11 ఏళ్ల విజయోత్సవ కార్యక్రమాన్ని బీజేపీ మైలార్దేవ్పల్లి-2 అధ్యక్షులు సురెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని వాంబే కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జగ్జీవన్ రాం, శ్యామా ప్రసాద్ ముఖర్జీలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారి దూరదృష్టి, సిద్ధాంతాలు, భారతీయ జనసంఘ్ స్థాపనలో పాత్రను పేర్కొంటూ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించడం జరిగిందన్నారు. అనంతరం బీజేపీ మైలార్దేవ్పల్లి-2 డివిజన్ అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో మైలార్దేవ్పల్లి డివిజన్ లో పెద్ద ఎత్తున వృక్షారోపణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి మల్లేశ్ యాదవ్, సూరెడ్డి వినయ్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ ఎస్సీ మోర్చా కన్వీనర్ జోగు రవి, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆడికే రాజు, మాజీ ఎంపీటీసీ వై.నర్సిరెడ్డి, లక్ష్మి రెడ్డి, అద్దలకాడి రవి కుమార్, జి.అంజి, గుర్రం గణేష్, అరుణ్ కుమార్, బాబుజీ, గణేష్, శ్రీకాంత్, కొండల్, ఎ. శివ శంకర్, గౌరి, హనుమంత్ రెడ్డి, ప్రదీప్, నిఖిల్, ప్రేమ్ కుమార్, మోహన్, రాహుల్ రెడ్డి,మగని శివ, డి.వేణు కుమార్, ఎస్. వినయ్ రెడ్డి, రావేంద్ర, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలి

రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయానికి అనుగుణంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ అన్నారు. భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ ఎన్పీపీటీఐ చౌరస్తాలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథగా హాజరైన ఆయన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడైన శ్యాం ప్రసాద్ ముఖర్జీ, జనసంఘ్ను స్థాపించి దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా స్థానం పొందినాడని గుర్తు చేశారు. అలాంటి మహానీయుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ ముదిరాజ్, కోరని సదానంద్, హరికిషన్, జి,సోల్కరెడ్డి, కోరని క్రాంతి, బాబూరావు, వనితరెడ్డి, బండారి బాలకృష్ణ, పద్మావతి, మల్లేష్టీ, వెంకటేష్, తిరుమల్లేష్, శ్రీనివాస్ రెడ్డి, రవికాంత్, వేణుగోపాల్, విజయ్ యాదవ్, కవిత, రాజశేఖర్ రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ ఆదర్శనీయుడు

మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** బాబు జగ్జీవన్ రామ్ ఆదర్శనీయుడని మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ 39 వ వర్ధంతి సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ తరపున ఘనంగా నివాళి అర్పించారు. మహనీయుల జయంతుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఎడ్లకాడి సూర్యం ఆధ్వర్యంలో బిజెఆర్(ఆరాంఘర్) ఎక్స్రోడ్లో బాబు జగ్జీవన్ రామ్ 39వ వర్ధంతిని పురస్కరించుకుని, బీఆర్ఎస్ పార్టీ మైలార్దేవ్పల్లి డివిజన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ఎస్.వెంకటేష్ హాజరై మాట్లాడుతూ.. సమానత్వం కోసం పోరాడిన మహానేతకు అందరు హృదయపూర్వకంగా ఘన నివాళ్ళు అర్పించారన్నారు. బాబు జగ్జీవన్ రామ్ భారత రాజకీయాల్లో చిన్న వయసులోనే అపూర్వమైన స్థానం దక్కించుకున్న నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నోముల రాము యాదవ్, సోమ శ్రీనివాస్ గుప్త, గుమ్మడి కుమార్, ఈర్ల ప్రవీణ్, దుర్గేష్, కొంపల్లి జగదీష్ నేత, సునీల్, వెంకటరమణ, భాస్కర్, మహిళా నాయకురాలు సరిత, భూదేవి, అరుణ రెడ్డి, ఈశ్వర్ నేత, యేశాల వెంకటేష్, మహేష్, శంకర్, జగన్, యాదగిరి, అశోక్, పోతారాజ్ రమేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

## రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్







**గండిపేట్, : సూర్య ప్రతినిధి** ఇటివల స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ అంబేద్కర్ స్టాచు ఎదురుగా ఉన్న డివైడర్ కు రాజేంద్రనగర్ ఎగ్జిట్ నుండి వస్తున్న కారు ఢీకొని కారు వెనకాల నుండి వస్తున్న బైకిస్టుకు తీవ్ర గాయాలు అయ్యాయని రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ అన్నారు. దీంతో పాటు కారులో ఉన్న మహిళ తలకు గాయం కావడం జరిగిందన్నారు. రాజేంద్రనగర్ ఎగ్జిట్ ఉన్నందువలన ఎల్బీనగర్ దిల్సుఖ్నగర్ ఉప్పల్ శంషాబాద్ పాత పట్టణం వారికి సులభతరం కావడం వల్ల రోజురోజుకు వాహనాల రద్దీ పెరిగిపోతోందన్నారు. రోడ్డు మధ్యలో డివైడర్ పనులు నడుస్తున్నందువలన ఎక్కడా కూడా స్ట్రీట్ లైట్స్ లేవని, గత




సంవత్సరం నుండి సెంటర్ లైట్లు లేక ప్రజలకు చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. జూన్ మాసంలోనే మనసాహిల్స్ పోయే దారి వద్ద యాక్సిడెంట్ జరిగిందన్నారు. అలాగే డిఆర్ఆర్ వద్ద యాక్సిడెంట్ జరిగింది వెటర్నరీ కాలేజ్ వద్ద యాక్సిడెంట్ జరిగిందన్నారు. ఇలా రాజేంద్రనగర్ నుండి హిమాయత్ నగర్ ఎగ్జిట్ వరకు నెలకు రెండు, మూడు ఆక్సిడెంట్లు జరుగుతూనే ఉన్నాయన్నారు. రోడ్డు చిన్నగా ఉన్నందు వల్ల అతివేగంగా వచ్చే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని గతంలో జిహెచ్ఎంసి అధికారులకు, ట్రాఫిక్ పోలీస్ వారికి తెలియజేయడం జరిగిందని, కానీ ఎటువంటి చర్య తీసుకోలేదన్నారు. ఈ నెల అంతా కూడా బోనాల పండుగ ఉండడం వలన రోడ్డుపైన రద్దీ ఎక్కువనే ఉంటుందని, కావున సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు.

# ఆంధ్ర తెలంగాణ జోన్-ఈ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు






**గండిపేట్, : సూర్య ప్రతినిధి** మణికొండ మునిసిపాలిటీ పరిధిలోని ఫ్యూచర్ కిడ్స్ స్కూలు ఆధ్వర్యంలో ఆంధ్ర తెలంగాణ జోన్-ఈ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్ క్రీడా పోటీలు అల్కాపూర్ లోని జయశంకర్ పార్కులో శనివారం నిర్వహించారు. అందులో భాగంగా మొత్తం 14 బాలికల జట్లు పోటీలలో పాల్గొనగా అండర్ 14, 16 లలో మొదటి స్థానం ఫ్యూచర్ కిడ్స్ స్కూలు కైవసం చేసుకొన్నారనీ, రెండవ స్థానం నాసిర్ బాలికల పాఠశాల సాధించగా మూడవ స్థానం సుజాత గర్ల్స్ స్కూల్ సాధించారని తదనంతరం అండర్ 17 లో మొదటి స్థానం ఫ్యూచర్ కిడ్స్ స్కూలు కైవసం చేసుకొన్నారనీ, రెండవ స్థానం నాసిర్ బాలికల పాఠశాల సాధించారని ఫ్యూచర్ కిడ్స్ స్కూలు డైరెక్టర్ శైలజా రావు, మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి కోఆర్డినేటర్ శ్రీనివాస్ రావు, కోశాధికారి హరనాథ్ రెడ్డి ఆటల పోటీలకు సంబంధించి ఇంటర్ నేషనల్ కోచ్ అరబిందో, రిఫరీ వినోద్ కుమార్, రాజి రెడ్డి, నార్మన్ లు ప్రకటించారు. దీంతో పాటు ఆదివారం బాలుర బాస్కెట్ బాల్ క్రీడా పోటీలలో మొత్తంగా 15 జట్లు పాల్గొనగా అందుకు గాను ముఖ్య అతిథిగా మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్




ముఖ్య సలహా దారుడు అందె లక్ష్మణ్ రావు, చీఫ్ పాట్రన్, స్థానిక మాజీ కౌన్సిలర్ నవీన్ కుమార్ లు హాజరయ్యారు. ఈ పోటీలలో ఫ్యూచర్ కిడ్స్ స్కూలు క్రీడాకారులతో పాటు సుజాత, నాసిర్, గీతాంజలి వేదిక, ఇంటర్ నేషనల్, కల్పా స్కూలు నిర్వాహకులు పాల్గొన్నారు. ఆదివారం ఫలితాలలో అండర్ 14, 17, 19 లలో మొదటి స్థానం ఫ్యూచర్ కిడ్స్ స్కూలు కైవసం చేసుకొన్నారనీ, రెండవ స్థానం నాసర్ పాఠశాల వారు సాధించారని, ఈ పోటీలలో ఉత్తమంగా ఆట ఆడిన వారిని నేషనల్ లెవెల్ పోటీలకు పంపడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# ఆరు గ్యారంటీలు అమలు అయ్యే వరకు వదిలిపెట్టం

మాజీ ఎంపీపీ కృపేష్

స్థానిక ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ది చెబుతారు

**ఇబ్రహీంపట్నం,జూలై 06, ప్రభాత సూర్య:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు అయ్యే వరకు వదిలే ప్రసక్తే లేదని మాజీ ఎంపీపీ కృపేష్ అన్నారు. పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని ,లింగంపల్లి డబుల్ బెడ్ రూమ్ లో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామ సభల ద్వారా లబ్ది దారులకు ఎంపీక చేయటం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మంచిరెడ్డి కిషన్ రెడ్డి అభివృద్ధి పనులు జరిగాయని వారు గుర్తు చేశారు. పట్నం కట్ట వెడల్పు చేసి యాక్సిడెంట్లు జరగకుండా చేశారు. టిఆర్ఎస్ గతంలో శంకుస్థాపన చేసి అభివృద్ధి చేస్తే ఇప్పుడు మీరు ప్రారంభోత్సవం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 18నెలల కాలంలో ఎక్కడ కూడా ప్రజలకు న్యాయం జరగలేదు.

అభివృద్ధిలో ప్రభుత్వం పెయిల్ అయ్యిందన్నారు. రైతులకు ఎవరికీ కూడా రైతు భరోసా, రైతు బంధు రుణ మాఫీ ఎక్కడ జరగలేదు..

మహిళలకు 2500, ఉచిత స్కూటీ ఇస్తానని ఇవ్వలేదు.




పెళ్లి చేసుకున్న నిరుపేదలకు తులం బంగారం ఎక్కడ అని విమర్శించారు. బుగ్గ రాములు, మహేందర్ రెడ్డి, బిట్ల వెంకట్ రెడ్డి, దేరంగుల నరసింహ, నంది కొండ భాస్కర్ రెడ్డి, బూడిద నర్సింహా రెడ్డి,గోపాల్,సామాల శ్రీనివాస్ రెడ్డి,ప్రేమ్ కుమార్,యువ నాయకులు నిట్టు జగదీష్, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దాతృత్వాన్ని చాటుకున్న సుర్వి నరసింహా గౌడ్

**చౌటుప్పల్.జులై 06. న్యూస్ ఇండియా :** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం తాళ్లసింగారం గ్రామం 2 వార్డులో ఇటీవల మరణించిన జంపాల యాదయ్య కుటుంబానికి తాళ్ల సింగారం గ్రామ మాజీ సర్పంచ్, చౌటుప్పల్ కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్ 100 కేజీల బియ్యాన్ని మృతుని కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దొనకొండ కృష్ణ, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కొండపురం గణేష్ గౌడ్,ఊదరి నరసింహ, మాజీ సర్పంచ్ యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తూర్పునూరు శ్రీకాంత్ గౌడ్, కొమ్ము లక్ష్మయ్య, జంపాల ముత్యాలు, వెంకటరెడ్డి, సుర్వి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ విద్యార్థులకు అండగా ఉంటుంది

-ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే నాలక్ష్యం
-ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు ఎమ్మెల్యే చేయూత...
-చౌటుప్పల్ మండల వ్యాప్తంగా 64 మంది విద్యార్థులకు నగదు బహుమతి,ప్రతిభ పురస్కారాలు అందజేత...
-ప్రభుత్వ బడులపై నమ్మకం కలిగించేలా ముందుకు వెళ్దాం...
-ప్రభుత్వ బడిలో చదివినవారు ఎందరో గొప్ప స్థాయిలో ఉన్నారు...
-మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,కోమటిరెడ్డి లక్ష్మి







**చౌటుప్పల్.జులై06. ప్రభాత సూర్య:** కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, సమాజంలో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డ వారంతా ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారేనని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన విద్యార్థులకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులు ఆదివారం మునుగోడు క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పాఠశాలలో చదివిన ప్రతిభవంతులైన విద్యార్థులకు సన్మానం,నగదు బహుమతి,ప్రతిభ పురస్కారాల ప్రధానంను వారి చేతుల మీదుగా అందజేశారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి స్థానం సాధించిన వారికి 15000 రూపాయలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి 10000 రూపాయలు, తృతీయ స్థానం సాధించిన వారికి 7500 రూపాయలు నగదు బహుమతితో పాటు ప్రతిభ పురస్కారాలను అందజేశారు.మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా 62 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 188 విద్యార్థినీ విద్యార్థులను సన్మానించి ప్రభుత్వ బడులను బ్రతికించుకోవడానికి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కొమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ..
ప్రభుత్వ స్కూళ్లను ప్రోత్సహించి అభివృద్ధి చేయడానికి ఈ కార్యక్రమానికి శ్రీకారం చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కూడా చిన్నప్పటినుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివారని గుర్తు చేశారు.
ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రతిభ చూపిన విద్యార్థిని విద్యార్థులకు ఆర్థిక సహకారం అందిస్తూ ప్రోత్సాహం అందించగలిగితే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఇటువంటి ప్రోత్సాహ బహుమతులు అందజేయడం వలన మిగతా విద్యార్థిని విద్యార్థులకు స్ఫూర్తి కలిగిస్తుందన్నారు. ప్రతి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి తన ధ్యేయమని అన్నారు. మన సంపాదించుకున్న ధనం పోతుంది, కానీ మనం చదివిన జ్ఞానం ఎటు పోదని విద్యార్థులకు తెలిపారు. చదువు లేకపోవడం వల్లనే అజ్ఞానంతో సమస్యల వలయంలో చిక్కుకుని పోతున్నారన్నారు. పేదలు కాయ కష్టం చేసుకుంటూ తమ సంపాదనలో 75% పిల్లల చదువుకే ఖర్చు చేస్తున్నారన్నారు. నేడు కొంతమంది తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో చదివించడం ఒక స్టేటస్ లాగా భావిస్తున్నారని ఆ ఆలోచన నుండి బయటపడేయడానికి ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పేదల చదువుకు గత ప్రభుత్వం చేసిన దానికంటే ఎక్కువగానే ఖర్చుచేసి ప్రభుత్వం ముందుకు వెళు తుందన్నారు. దాంట్లో భాగంగానే నియోజకవర్గంలలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యా బలోపేతంపై కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయడానికి ఇప్పటికే చాలా సమీక్షలు చేశామన్నారు. మేమంతా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వాళ్ళమే అని ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ స్థాయికి చేరుకున్నామని విద్యార్థులకు తెలిపారు. సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న వాళ్లంతా కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివిన వాళ్లేనని గుర్తు చేశారు. కొన్నేండ్లుగా పరిపాలించిన ప్రభుత్వాలు విద్య పైన ఎక్కువ నిధులు కేటాయించలేదన్నారు. బడి గుడితో సమానమన్నారు. ఉపాధ్యాయులు 50% బాధ్యత తీసుకుంటే మిగతా 50 శాతం తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు.మంచి సమాజాన్ని నిర్మించాలంటే పిల్లలతో మాట్లాడడానికి తల్లిదండ్రులు సమయాన్ని కేటాయించాలన్నారు. సోషల్ మీడియా విద్యార్థులపై దుష్ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. స్నేహితుల పట్ల, బంధువుల పట్ల,సమాజం పట్ల ఏవిధంగా ఉండాలో నేర్పించాల్సింది తల్లిదండ్రులేనని అన్నారు.
ప్రభుత్వ బడులను అభివృద్ధి చేయడానికి 100 శాతం ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 43 ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించామని ఈ 43 పాఠశాలల్లో 20వేల మంది విద్యార్థులు తగ్గకుండా చదివే లాగా మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించామని అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కష్టపడి ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రతి సంవత్సరం ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. మా అమ్మ కష్టాన్ని కల్లారా చూసిన నేను మా అమ్మ పేరు మీద ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని అన్నారు. ప్రభుత్వ బడులపై నమ్మకం కలిగించే విధంగా ముందుకు వెళ్దామన్నారు. పదవ తరగతి పరీక్షల్లో మొదటి,ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను ఆయన అభినందించారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అందరికీ అండగా ఉంటుందన్నారు. మునుగోడు నియోజకవర్గం వ్యాప్తంగా ప్రోత్సాహ బహుమతులు అందుకున్న వారిలో మండలాల వారీగా మునుగోడు మండలంలో 8 పాఠశాలలు 24 మంది విద్యార్థులు, చౌటుప్పల్ 21 పాఠశాలలో 64 మంది విద్యార్థులు, నారాయణపూర్ 8 పాఠశాలలు 24 మంది విద్యార్థులు, గట్టుప్పల్ 4 పాఠశాలలు 13 మంది విద్యార్థులు, మర్రిగూడ 9 పాఠశాలలు 27 మంది విద్యార్థులు, నాంపల్లి 5 పాఠశాలలు 16 మంది విద్యార్థులు, చండూరు 7 పాఠశాలలు 21 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రతిభా పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కే సత్యనారాయణ, చౌటుప్పల్ మండల విద్యాధికారి ఈ గురువారావు, మునుగోడు నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, మాజీ జెడ్పిటిసి చిలుకూరు ప్రభాకర్ రెడ్డి,సుర్వి నరసింహ గౌడ్,చింతల సాయిలు,వివిధ గ్రామాల నాయకులు, పాఠశాలల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మతాలకతీతంగా మొహరం పండుగ





**సంస్థాన్ నారాయణపురం, జూలై 06( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని వివిధ గ్రామాల్లో పీర్ల పండుగ వారం రోజుల పాటు కొనసాగింది. హిందూ ముస్లిం తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా భక్తి శ్రద్ధలతో ఉత్సాహంగా జరుపుకొన్నారు.జనగాం గ్రామంలో కొన్ని సంవత్సరాల తరువాత పీర్ల పండుగ జరపడంతో గ్రామంలో మొహరం పండుగ పూర్వ వైభవం వచ్చింది అని గ్రామస్తులు ఆనందోత్సాహాలతో భక్తులు పీర్లకు దట్టీలు సమర్పించి మలీజా, మటికలతో ఫాతెహాలు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఆశర్ ఖాన వద్ద పండుగ వాతావరణం నెలకొన్నది. పెద్దసంఖ్యలో భక్తులు అలావ్ చుట్టుగా చిందులు తొక్కుతూ అసోయ్ దూలా అంటూ దులా ఆడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రందాకా పీర్లను ఎత్తుకొని ఆటలాడారు. పీర్ల పండుగ సందర్భంగా గ్రామంలోని పిల్లలు వివిధ రకాల వేషధారణలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఆదివారం రాత్రి పీర్లను ఊరి చివరలో ఉన్న బావిలో నిమజ్జనం చేశారు.అనంతరం అల్విధ పాటలతో ఆషర్ ఖానా కి తిరుగు ప్రయాణం అయ్యారు.దీంతో వారం రోజులుగా కొనసాగిన పీర్ల పండుగ ఆదివారం ముగిసింది.ఈ వేడుకలలో గ్రామ ప్రజలు,ముస్లీం సోదరులు మహమ్మద్ ఉస్మాన్,మహ్మద్ ఖాదర్,మహ్మద్ కా,సలీం,కైసర్,అహ్మద్ పాషా ఏజాస్,జమీల్,మునీర్,ఖాసీం అఖిల్,ఆదిల్, గ్రామ పెద్దలు బెల్లంకొండ స్వామి,ఐతరాజు మల్లయ్య,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిపి గుత్తా ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

హాజరైన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సుశీల ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మి



**సంస్థాన్ నారాయణపురం, జూలై 06( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల లోని మల్కపురం ఆందోల్ మైసమ్మ దేవస్థానంలో సంస్థాన్ నారాయణపురం మండల మాజీ ఎంపీపీ గుత్త ఉమా ప్రేమ్చందర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అలాగే కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మి విచ్చేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి అనంతరం చౌటుప్పల్, నారాయణపురం మండల కాంగ్రెస్ కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు ఆమెకు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇలాంటి వేడుకలను మరెన్నో జరుపుకోవాలని మండల అభివృద్ధికి ఇంకా ఎన్నో పదవులతో అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## సామాజిక విప్లవ యోధుడు బాబు జగ్జీవన్ రామ్

బీఎస్పీ అధ్యక్షులు పట్నం రమేష్



**తుర్కయంజాల్, జూలై 06, ప్రభాత సూర్య:** రాజకీయ, సామాజిక విప్లవ యోధుడు బాబు జగ్జీవన్ రావు అని బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ అన్నారు. ఆదివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ బిఎస్పి పార్టీ కోశాధికారి చెక్క రంజిత్ కుమార్ అధ్యక్షతన అంబేద్కర్ చౌరస్తాలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్నం రమేష్ విచ్చేసి మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం పోరాడుతూ మరొక వైపు సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరుగని సమరం సాగించిన రాజకీయ , సామాజిక విప్లవ యోధుడు, సంఘ సంస్కర్త మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లపంగి రాజు, సీనియర్ నాయకులు డా.యడవల్లి శ్యామ్, మాజీ కార్యదర్శి జంతుక సైదులు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్యాం ప్రకాశ్ ముఖర్జీ జయంతి

బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్





**తుర్కయంజాల్,జూలై 06, ప్రభాత సూర్య:** జన సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి తుర్కయంజాల్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు ఎలిమేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ విచ్చేసి మాట్లాడుతూ భాజపా దేశంలో అధికారంలో ఉంది అంటే ఆరోజులలో డాక్టర్ శ్యాం ప్రకాష్ ముఖర్జీ ఎందరో మహనీయుల పడిన క్షమా ఫలితంగానే నేడు దేశంలో పలు రాష్ట్రాలలో అధికారంలో ఉన్నామని వారు గుర్తు చేశారు. వారు ఒకే దేశంలో ఇద్దరు ప్రధానులు రెండు రాజ్యాంగాలు రెండు జెండాలు ఉండొద్దని ఆనాడే తెలియజేశాడని గుర్తు చేశారు. జమ్మూ కాశ్మీర్ దేశంలో భాగమని కాశ్మీర్ పైన పూర్తి అధికారం భారతదేశనికే ఉందని ఆనాడు శ్యాంప్రకాష్ ముఖర్జీ జమ్మూ కాశ్మీర్ కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సమర్పణ చేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ళ రమేష్, కొత్త రాంరెడ్డి, కందాల బలదేవ రెడ్డి , కోహెడ మాజీ సర్పంచ్ అర్జున్ గౌడ్, కొంతం బాల్రెడ్డి, యూసుఫ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, బిక్షపతి, రవీందర్ గౌడ్, అజయ్ గౌడ్ గుండా కృష్ణ, సురేష్, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## త్యాగానికి ప్రతికగా మారుమోగిన మొహరం

ఆట పాటలతో పీర్ల పండుగ కొలహాలం



**సంస్థాన్ నారాయణపురం, జూలై 06( ప్రభాత సూర్య)** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం లోని అన్ని గ్రామాలలో పీర్ల పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ఆటపాటలతో పీర్ల పండుగను జరుపుకున్నారు. వారం రోజుల నుండి పీర్ల కొట్టాలలో ప్రతిష్ఠించి ఆదివారం రోజున బయటకు తీసి హిందువులు ముస్లింలు గ్రామ కూడలి ప్రజలు కలిసి డప్పు చప్పుడులతో ఉత్సాహంగా ఊరేగించారు.యువకులు పెద్దలు ఆటలాడుతూ సంతోషంగా పండుగను జరుపుకున్నారు. పీర్లకు కుడకా, ఉద్, బెల్లం పిండి వంటలతో నైవేద్యం సమర్పించి పురవీధుల గుండా ఊరేగింపుతో తిరగడంతో దుకాణదారులు ఇంటి యజమానులు చందా రూపంలో దట్టిలను కప్పి మొక్కులను తీర్చుకున్నారు. అన్ని గ్రామాలలో వైభవంగా ఈ పండుగను జరుపుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామలల్లో ప్రజలు, యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు..!



**వనపర్తి ప్రభాత సూర్య ప్రతినిధి...** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి శారదా దంపతులు వనపర్తి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన దంపతులకు ఆలయ ప్రధాన అర్చకులు రఘునాధచార్యులు ఆధ్వర్యంలో పూర్ణకుంభం తో వేద పండితులు మహిళలు సంకీర్తనల, నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు ఈ సందర్భంగా దంపతులిద్దరిని ఆలయ పండితులు వేద ఆశీర్వాదాలు అందించారు ఈ కార్యక్రమంలో మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

